



స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పూజారులు

31న పిఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా

- సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనువాసులురెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ పెన్షన్ పునరుద్ధరణ, ప్రావిడెంట్ ఫండ్ నిధులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 31న పిఎఫ్ కార్యాలయంల ఎదుట నిర్వహించే ధర్నా జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కార్యాలయ ఆవరణంలోని విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం జనవరి నుంచి రిటైర్డ్ అవుతున్న ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఉద్యోగులకు, కొత్త ఫ్యామిలీ పెన్షనర్స్‌కు రావాల్సిన ప్రావిడెంట్ ఫండ్ నిధులు, పెన్షన్ చెల్లింపులను ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ప్రాంతీయ కార్యాలయం కడప వారు పూర్తిగా నిలిపి వేశారని తెలిపారు. ఈ నేపథ్యంలో బ్యాంకు యాజమాన్యం , ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయం వారు తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకుకు, రిటైర్ ఉద్యోగులకు ఇవాల్సిన నిధులు తక్షణమే బ్యాంకు పెన్షన్ ఫండ్ ట్రస్ట్‌కు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయం గురించి పలు ఉత్తరాలు ద్వారా, అధికారులను కలిశామని పేర్కొన్నారు. మన రాష్ట్రం, పక్క రాష్ట్రాల ప్రావిడెంట్ ఫండ్ అధికారులు సక్రమ చర్యలు తీసున్నప్పటికీ కడప వారు మాత్రం చాలా పైశాచికంగా రిటైర్డ్ ఉద్యోగులను మనోవేదనకు గురిచేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో కె. రమణరెడ్డి ,మధు, వీరమలేష్ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - వల్లూరు

ఆదర్శ పాఠశాల అభివృద్ధికి ప్రిన్సిపళ్లు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదర్శ పాఠశాల డైరెక్టర్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో కడప జిల్లా, అన్నమయ్య జిల్లాలోని ప్రిన్సిపళ్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే సంవత్సరంలో పదవ తరగతి, ఇంటర్ ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత తీసుకురావడానికి ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. అందరూ సమిష్టిగా పనిచేసి ఆదర్శ పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో పాఠ్యాంశాలు అర్థమవుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డిఇఒ దేవరాజు, వల్లూరు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ మూర్తి సురేష్ బాబు , ప్రిన్సిపల్ దిలీప్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ప్రతి శని, ఆదివారాల్లోనూ క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు

కడప : జిల్లాలో ఉత్తమ క్రికెట్ క్రీడాకారులను తయారు చేసే విధానంలో భాగంగా ఇకనుంచి ప్రతి శని ఆదివారాల్లోనూ కడపలోని కెఎస్ఆర్ ఎమ్, కేఓఆర్ ఎం క్రికెట్ మైదానాలలో అండర్ -12, 14, 16, 19, సీనియర్స్ ఇలా ప్రతి ఏజ్ గ్రూపుల విభాగాలలో క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ. రెడ్డి ప్రసాద్, డిసిఐఎస్ కాజా మైనుద్దీన్, రంజి, ఐపీఎల్ ప్లేయర్ పైడికాల్వ విజయ్ కుమార్ తెలిపారు. నందలూరు సబ్ సెంటర్ నుంచి కడప జిల్లా జట్టుకు, ఆంధ్ర రాష్ట్ర క్రికెట్ జట్టుకు క్రీడాకారులు ఆడడం చాలా గొప్ప విషయమని అన్నారు. శుక్రవారం జిల్లాలోని పలు క్రికెట్ సబ్ సెంటర్లను వారు సందర్శించారు. ఇందులో భాగంగా నందలూరు సబ్ సెంటర్‌ను కూడా వారు సందర్శించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ ప్రతి విభాగంలోనూ ఆంధ్ర రాష్ట్రానికి ప్రాతినిత్యం మన జిల్లా క్రీడాకారులు వహించడం గొప్ప విశేషం అన్నారు. ఈ సంఖ్యను మరింతగా పెంచేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఎక్కువ మంది క్రికెట్ ప్లేయర్లు వస్తుండడం వల్ల అదనంగా నెట్స్, ఆస్ట్రో టర్ఫ్, నట్స్ కు కావాలసిన మెటీరియల్స్ అన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. లీగ్ మ్యాచ్లలో బ్యాట్‌మెన్ల మంచి స్కోరును కొట్టి, బౌలర్లు మంచి వికెట్లు తీసి జిల్లా రాష్ట్ర క్రికెట్ జట్లకు ఎంపిక కావాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కోచ్ గయాజ్, అసిస్టెంట్ కోచ్ ఫిరోజ్ ఖాన్ లోడి, ట్రైనర్ శివకోటి, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రాలు

ప్రజాశక్తి - కడప



ప్రశంసా పత్రాలు అందుకుంటున్న భాస్కర్‌రెడ్డి, నరసింహ ప్రసాద్



ప్రశంసా పత్రం అందుకుంటున్న ఎస్ఐ ఎం. విష్ణువర్ధన్

విద్యుత్ శాఖ కడప డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విద్యుత్ శాఖ అధికారి ఎల్. నరసింహ ప్రసాద్ 74 వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా కడప పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఉత్సవాలలో కలెక్టర్ విజయ్‌రామరాజు చేతుల మీదుగా అందుకున్నారు. ఆయన ప్రశంసాపత్రం అందుకోవడం పట్ల విద్యుత్‌శాఖ కడప డివిజనల్ ఎగిక్యూటివ్ ఇంజనీర్లు, ఏ డిఇలు, ఎఇలు, ఎఇలు, సిబ్బంది అభినందన శుభాకాంక్షలు తెలియ జేశారు. **ఎపిఎస్‌పిడిసిఎల్ సిఐ దాదిరెడ్డి భాస్కర్ రెడ్డి** వైఎస్ఆర్ జిల్లా ఎపి ఎస్‌పి డిసిఎల్ విజిలెన్స్ విభాగంలో సిఐగా విధులు నిర్వహిస్తున్న దాదిరెడ్డి భాస్కర్ రెడ్డి కలెక్టర్ విజయ్ రామరాజు చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. తమ సేవలను గుర్తించి ప్రతి సంవత్సరం ఉత్తమ అవార్డుకు ఎంపిక చేయడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన అన్నారు. **వల్లూరు** : విధినిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన వల్లూరు ఎస్ఐ ఎం.విష్ణువర్ధన్‌కు గురువారం కడపలో నిర్వహించిన 74వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో , ఎస్పీ అన్బురాజన్ చేతుల మీదుగా ఉత్తమ ప్రశంసా పత్రం అందుకున్నారు. ప్రశంసా పత్రం అందుకున్న ఎస్ఐ ఎస్పీకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి- పోరుమామిళ్ల టౌన్

ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, థోమస్ రెడ్డి, చిత్తా దంపతులు బి.కోడూరు మండలం సగిలేరులోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో చదువుతున్న 434 మంది బాలురకు శుక్రవారం ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. వీటిని సంస్థ ప్రతినిధులు జి. శ్రీకాంత్ రెడ్డి, ఎల్. ప్రసాద్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎఫ్‌సిఎన్ సంస్థ ద్వారా గత 20 ఏళ్ళ గా వైద్య ,విద్య ,ఉపాధి కల్పన ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో దుస్తుల పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ నిరంజన్ వరప్రసాద్ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని సంస్థ వ్యవస్థాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.



దుస్తులు అందుకున్న విద్యార్థులతో దాతలు

ప్రజల ప్రాణ భద్రతే ప్రభుత్వ ధ్యేయం

జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ వి.విజయ్ రామరాజు

ప్రజాశక్తి - కడప



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్ రామరాజు

ప్రజల ప్రాణ భద్రతే ప్రభుత్వ ప్రధాన ధ్యేయం అని, ఆ దిశగా జిల్లాలో రహదారుల భద్రత కోసం పటిష్టమైన చర్యలు చేపట్టేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో మనస్ఫూర్తిగా పని చేయాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబంధితాధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యధిక శాతం ప్రజలు రోడ్డు ప్రమాదాల కారణంగానే ప్రాణాలు కోల్పోవడం జరుగుతోందన్నారు. జనాభాతో పాటు వాహనాల వినియోగం కూడా పెరుగుతున్న నేపథ్యంలో రవాణా శాఖ, అనుబంధ శాఖల అధికారులు రహదారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి వాహన ప్రమాదాలను అరికట్టే దిశగా భద్రత చర్యలు చేపట్టాలన్నారు. పోలీస్, రవాణా, ఇంజినీరింగ్, ఆరోగ్య శాఖల అధికారులు ఐరాడ్ ద్వారా ప్రతీ రోడ్ ప్రమాదానికి గల కారణాలను, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలు విధిగా నివేదికను ఇవ్వాలని ఆదేశించారు. ఆయా శాఖల వారీగా బ్లాక్ స్పాట్లను గుర్తించి, ప్రమాద నివారణ చర్యలు తీసుకొని, ఫొటోతో సహ నివేదికను ఇవ్వాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో బారికెడ్లు స్టాపర్స్, ప్రమాద సంకేత సూచికలను పొందుపరచాలని పోలీస్, ఇంజినీరింగ్ అధికారులని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయాల్లో 108 వాహన సేవలు సకాలంలో అందేలా సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బస్సులు, ఇతర వాహనాలలో అధిక లోడుతో సరుకు, ఇతర సామగ్రి రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలసిందిగా రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. అడిషనల్ ఎస్పి అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదం జరగడానికి గల ప్రత్యక్ష కారణం ఎవరని నిర్ధారించేందుకు కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్ పరిధిలో కమర్షియల్ ఏరియాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్‌పి తుషార్ డుడీ, కమిటీ సభ్యులు, కన్వీనర్, డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ మీరా ప్రసాద్, ఆర్‌టిఒ సుశీల, ట్రాఫిక్ డిఎస్‌పి బాలస్వామిరెడ్డి, ఎంవిఐలు, డిఎంహెచ్‌ఒ నాగరాజు, డిసిహెచ్ఎస్ మెడికల్ సూపరింటెండెంట్, ఆర్ అండ్ బి, విద్యుత్ శాఖల ఎస్ఇలు, మున్సిపల్ కమిషనర్లు, నేషనల్ హై వేస్ అధికారులు, కమిటీ సభ్యులు జి. వెంకట రమణ పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా ముఖ ఆధారిత హాజరు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

డిఎంహెచ్ఒ కార్యాలయంలో ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ వ్యవహారం ఇష్టారాజ్యంగా నడుస్తోంది. ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ డిఎంహెచ్ఒ పర్యవేక్షణలో జరగాల్సిన వ్యవహారాన్ని సూపరింటెండెంట్ స్థాయి అధికారులకు బదిలీ చేయడమేమిటనే విమర్శ పెద్దఎత్తున వినిపిస్తోంది. డిఎంహెచ్ఒ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వంటి సీనియర్ అధికారులను విస్మరించి సుమారు నలుగురుపైగా ఉన్న సూపరింటెండెంట్స్, సీనియర్ అసిస్టెంట్స్ వంటి కిందిస్థాయిలో ఉద్యోగుల్లో క్రమశి క్షణ తేవడానికి ఉద్దేశించి చేపట్టిన ముఖ ఆధారిత హాజరును వారికే అప్పగించడమేమిటని ప్రశ్న వినిపిస్తోంది. ఇటువంటి ధోరణిని గమనిస్తే దొంగచేతికే తాళాలు ఇచ్చినట్లు అవుతుందనే సామెతను గుర్తు చేస్తోందనే విమర్శ పెద్దఎత్తున వినిపిస్తోంది.

వైసిపి నుంచి నుంచి రజని సస్పెన్షన్

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు



మాట్లాడుతున్న చైర్మన్ జింకా విజయలక్ష్మి

వైసిపి నుంచి బొందిలి కార్పొరేషన్ డైరెక్టర్ రసపుత్ర రజనిని సస్పెండ్ చేసినట్లు పద్మశాలీయ కార్పొరేషన్ ఛైర్మెన్ జింకా విజయలక్ష్మి తెలిపారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎంఎల్ఎ రాచమల్లు ప్రసాదరెడ్డి, పార్టీ హైకమాండ్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు తెలిపారు. వైసిపి క్రమశిక్షణకు మారుపేరన్నారు. తప్పు చేసిన ఎంతటి వారైనా పార్టీ ఉపేక్షించదన్నారు. దొంగనోట్ల వ్యవహారంలో బెంగుళురులో పట్టుబడినందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దాదాపు 300 మంది డ్వాక్రా మహిళలను రూ.32లక్షలు మోసం చేసి జైలుకు పోయివచ్చిన టిడిపి పట్టణ మహిళా అధ్యక్షురాలు భోగాల లక్ష్మినారాయణమ్మపై ఇంతవరకు టిడిపి ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కేవలం అభియోగాలు ఎదుర్కొంటున్న తమ పార్టీ నేతను ఏకంగా పార్టీ నుంచి సస్పెండ్ చేశామని, ఇది తమ ఎంఎల్ఎ రాచమల్లు చిత్తశుద్ధికి నిదర్శనమని చెప్పారు. కార్యక్రమంలో బలిజపూసల సంఘం డైరెక్టర్ తుపాలకు వెంకటరమణ, సగర కార్పొరేషన్ డైరెక్టర్ మురళి, తొగటవీర కార్పొరేషన్ డైరెక్టర్ చౌడం రవిచంద్ర,ఆర్యకటిక డైరెక్టర్ ఉమామహేశ్వరి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ రాగనరసింహులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ యూత్ నూతన కార్యవర్గం ఎన్నిక



బొజ్జా తిరుమలేష్ బండి సుమంత్ కుమార్

కడప : ఎపి యూత్ కాంగ్రెస్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కడప జిల్లాకు చెందిన బొజ్జా తిరుమలేష్ 2054 ఓట్ల ఆధిత్యంలో గెలిచారు. ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆదేశాల మేరకు ఏపీ యూత్ కాంగ్రెస్ ఎన్నికల లెక్కింపు ప్రక్రియ శుక్రవారం పూర్తయ్యాయి. నెలల నుంచి నిర్వహించిన ఎన్నికల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సుమారు 37 మంది పోటీ ఉన్నారు. ఓట్ల అనంతరం ప్రటించిన ఫలితాల్లో బొజ్జా తిరుమలేష్ అత్యధిక ఓట్ల మెజారిటీతో ఎన్నికయ్యారు. **యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా** కడప జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బండి సుమంత్ కుమార్ 1911 ఓట్ల ఆధిత్యంలో గెలిచారు. శుక్రవారం ఓట్ల లెక్కింపు అనంతరం విజేతల పేర్లను ప్రకటించారు. ఈ సందర్భంగా సుమంత్ కుమార్ మాట్లాడుతూ 2024 ఎన్నికలే లక్ష్యంగా యూత్ కాంగ్రెస్ రెట్టింపు ఉత్సాహంతో యూత్ కాంగ్రెస్ లోని అన్ని నియోజకవర్గ అధ్యక్షులను జిల్లా నాయకులను కలుపుకొని పనిచేస్తామని తెలిపారు.

రిమ్స్ డిప్యూటీ డైరెక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి-కడప సిటీ

గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రి (రిమ్స్) డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు ఉత్తమ సేవలకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రం పొందారు. ఈనేపథ్యంలో శుక్రవారం ఆయన్ను ఆసుపత్రి అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది గజమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్యతిథులుగా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ శ్రీనివాసులు హాజరై ఆయన్ను అభినందించారు. అనంతరం డిడి మాట్లాడుతూ ఆసుపత్రి అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది సహకారంతోనే ఉత్తమ ప్రశంసా పత్రాన్ని పొందానని చెప్పారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ యు.దాత్రే శ్వరి, ఆఫీస్ సూపరింటెండెంట్లు కె.వరదరాజులు, గిరిజామనోహర్, సీనియర్ అసిస్టెంట్లు రవికుమార్, బి.వెంగళ్రావు, సి .వై. చందన, ప్రభుదాస్, శ్యామల, నాగార్జున, నరేంద్ర, జూనియర్ అసిస్టెంట్లు ప్రభుకర్, మునీంద్ర ,సిబ్బంది పాల్గొన్నారు.



డిడి శ్రీనివాసరావును సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

మాతృ మరణాలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

వైద్యులు అంకిత భావంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించినపుడే ప్రసూతి సమయంలో మాతృ, శిశు మరణాలను అరికట్టగలమని కలెక్టరేట్ ఓఎస్‌డి రఘునాథ్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని విసి హాలులో జిల్లా స్థాయి ప్రసూతి (మాతృ) మరణాల విచారణ, బాధ్యత కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రసూతి మరణాల రేటును జీరో శాతం తీసుకువచ్చేందుకు వైద్యాధికారులు, అంగన్వాడీ, ఆరోగ్యకార్యకర్తలు, ప్రతిఒక్కరూ అంకిత భావంతో పని చేయాలని ఆదేశించారు. గతంలో జరిగిన మాతృ మరణాలకు సంఘటనల వివరాలను, కారణాలకు తెలుసుకున్నారు. పిహెచ్‌సిలు, సిహెచ్‌సి లలో వైద్యాధికారులు క్రమం తప్పకుండా వారి పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలలో నమోదైన గర్భిణులు, బాలింతల వివరాలను తెలుసుకోవాలన్నారు. గర్భిణీ ఆరోగ్యం పట్ల మెడికల్ ఆఫీసర్, అంగన్వాడీ సూపర్ వైజర్లు నిరంతరం అప్రమత్తంగా ఉండేలా ఎప్పటికప్పుడూ సమీక్షించాలన్నారు. బాలింతలు, గర్భిణులకు ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. 'జన్మనిస్తూ.. ఏ తల్లీ, జన్మిస్తూ.. ఏ శిశువూ మరణించకూడదు' అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపడుతోందన్నారు. ప్రభుత్వ ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా జిల్లా స్థాయి అధికారులు బాధ్యతగా పని చేయాలన్నారు. సిడిపిఒలు కనీసం వారానికి మూడు సార్లు తప్పకుండా సూపర్‌వైజర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించాలని సూచించారు. ప్రతి మంగళవారమూ నిర్వహించే జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో పిహెచ్‌సీలు, ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు, రిమ్స్ జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, డిసిహెచ్ఎస్, అదనపు డి ఎం అండ్ హెచ్‌ఒలు డాక్టర్ ఖాదర్‌వలి, డాక్టర్ ఉమామహేశ్వర్, 108 జిల్లా కో - ఆర్డినేటర్ నాగరాజు, పిహెచ్‌సి, సిహెచ్‌సి వైద్యాధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోతుల నాగరాజుకు మద్దతు ఇవ్వాలి

కలసపాడు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి పోతుల నాగరాజుకు మద్దతు ఇచ్చి గెలిపించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి. అన్వేష్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఎంఎల్‌సి అభ్యర్థిని గెలిపించాలని పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసన మండలి అభ్యర్థి నాగరాజు నిష్పక్షపాతంగా ప్రజాసేవ చేస్తారని చెప్పారు. ప్రజా సమస్యలను మండలిలో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తారని చెప్పారు. పట్టభద్రులందరూ పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గురయ్య, వీరయ్య, పోలయ్య, హుస్సేన్ పీరా, బాబు, నరసింహులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి

కడప : ప్రతి ఒక్కరూ మంచి అలవాట్లతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని మైనారిటీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ వల్లూరి బ్రహ్మయ్య సూచించారు. యువజన సర్వీసుల శాఖ (స్టెప్) ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గాంధీనగర్ మున్సిపల్ స్కూల్లో 'వ్యక్తిత్వ వికాసం- కెరీర్ కౌన్సెలింగ్' పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసం అనేది ప్రతి ఒక్కరి అలవాట్లను, ఆరోగ్యానికి మెరుగు పరుస్తుందని చెప్పారు. చదువు, కలలు, క్రీడల పట్ల ఏకాగ్రత కలిగి మంచి ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. స్టెప్ సిఇఒ సాయి గ్రేస్ మాట్లాడుతూ దేశ జనాభాలో యువత 33 శాతం ఉన్నారని, ప్రపంచంలో ఇతర దేశంలో యువత ఇంత శాతం లేదని అన్నారు. యువజన సర్వీసుల శాఖ స్టెప్ ద్వారా యువతకు వ్యక్తిత్వ వికాసంతో పాటు కలలు, క్రీడలు, దిశా యాప్ మొదలగు వాటి గురించి అవగాహన కార్యక్రమాలు వివిధ కళాశాలలో విరివిగా నిర్వహిస్తున్నామని తెలిపారు. పాఠశాల హెచ్ఎం సత్య సుజాతమ్మ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమం తమ పాఠశాలలో నిర్వహించడం ఎంతో సంతోషదాయకమని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నోబెల్ సేవా సంస్థ సంఘం అధ్యక్షులు గంగిరెడ్డి నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి మణికంఠ విద్యార్థులు, అధ్యాపకులు, స్టెప్ మేనేజర్ వివి. సుబ్బారాయుడు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి-చెన్నూరు

మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ వాలంటీర్లు, సచివాల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని ఎంపిడిఒ గంగనపల్లి సురేష్ బాబు ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ అన్నారు. పట్టణంలోని ఒకటవ సచివాలయం సిబ్బందికి, వాలంటీర్లకు పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డితో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ వాలంటీర్లు ఇటు ప్రజలకు, అటు ప్రభుత్వానికి ఒక వారధి లాగా సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ ప్రతి ఒక్క లబ్దిదారునికీ చేరేలా చూడాలని చెప్పారు. విధి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం, అలసత్వం వహించినా సహించేది లేదని పేర్కొన్నారు. సమస్యలను త్వరగా పరిష్కరించి ప్రజల మన్ననలు పొందాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి సురేష్‌యాదవ్

రమణీయం కడప రాయుడి కల్యాణం

ప్రజాశక్తి - కడప అర్బన్

తిరుమలకు తొలిగడప దేవుని కడప, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు టిటిడి వారు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం కడప రాయుడు కల్యాణం కమనీయం, రమణీయంగా.. సాగింది. కన్నుల పండుగ నిర్వహించిన కల్యాణాన్ని అధిక సంఖ్యలో ప్రజలు తిలకించారు. కల్యాణోత్సవం సందర్భంగా అర్చకులు సాంప్రదాయపద్ధంగా శాస్త్రవేత్తంగా వెంకటేశ్వర స్వామికి శ్రీదేవి భూదేవికి కల్యాణం చేశారు. **నేడు రథోత్సవం...** వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి రథంపై స్వామి అమ్మవార్లు ప్రజలకు దర్శనం ఇవ్వనున్నారు. మధ్యాహ్నం రెండున్నర గంటలకు రథ్నా పురవీధుల్లో తిప్పనున్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఆటంకం కలగకుండా టిటిడి, పోలీస్ అధికారులు చర్యలు తీసుకున్నారు. **భారీ బందోబస్తు..** తిరుమలకు తొలిగడప దేవుని కడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కొనసాగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం నిర్వహించే రథసప్తమికి బందోబస్తు ఏర్పాటు చేశామని డిఎస్‌పి వెంకట శివారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరుగురు సిఐలు, 11 మంది ఎస్సైలు, 200 మంది సిబ్బందిని భద్రత కోసం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. చైన్ స్నాచింగ్, జేబు దొంగతనాలు, ఈవ్ టీజింగ్, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సాధించామని పేర్కొన్నారు. భక్తులకు ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూస్తామని తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో శ్రీవారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

యువతకు జిల్లా స్థాయి పోటీలు

ప్రజాశక్తి - కడప అర్బన్

భారత ప్రభుత్వం, నెహ్రు యువ కేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో భాగంగా యువతకు పార్లమెంట్ లో ప్రసంగించే అరుదైన అవకాశం కోసం జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్రాధికారి మణికంఠ తెలిపారు. శుక్రవారం బాలాజీ నగర్‌లోని నెహ్రు యువ కేంద్ర కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి యూత్ పార్లమెంటు పోటీలు లలో 10 మంది అర్హత సాధించారని తెలిపారు. అర్హత సాధించిన వారిలో షేక్. అయేషా , షైక్ అమీషా నాజ్, యశ్వంత్ రెడ్డి, సయిద్ సానియా, డి.సృజన, అమీనా షైక్, యస్ . వైష్ణవి , పి.రాజా శేఖర్ , జే పి సంజన , షైక్ . ఆర్షియా అహమ్మద్ ఎంపిక చేసినట్లు చెప్పారు. లెక్చరర్ శ్రావణి , లెక్చరర్ విజయ లక్ష్మి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. వీరు అనంతపురం లో నిర్వహించే రీ జినల్ లెవెల్ యూత్ పార్లమెంటు పోటీలకు వెళతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమెన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి విజయలక్ష్మి పాల్గొన్నారు


నేడు ఒబెరాయ్ హోటల్స్ బృందం రాక

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రపంచ పర్యాటక ప్రాంతం గండికోటను ప్రముఖ ఒబేరాయ్ హోటల్ బృందం శనివారం మధ్యాహ్నం రానున్నట్లు ఇన్‌ఛార్జి తహశీల్దార్ తిరుపతయ్య శుక్రవారం తెలిపారు. హోటల్ సిఇఒఅర్జున్ ఒబేరాయ్, రాజమాన్‌శంకర్, వినోద్ గోస్వామి, సమూర్ నాయర్, మహినర్ ఠాకూర్ బృందం గత ఏడాది అక్టోబర్ నెల 11న గండికోటకు వచ్చారు. అప్పట్లో గండికోట- కొట్టాలపల్లి దారిలో ఉన్న కొండపైన, గండికోట కొట్టాలపల్లి కొండ దిగిన తర్వాత ఎల్లమ్మ గుడి దగ్గరలో, ధోని వంకకు తూర్పు వైపున రీసార్ట్, విల్లాస్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. ఇప్పుడు మళ్లీ ఓబేరాయ్ హోటల్ బృందం రానుంది.

ముస్లిం ఐక్య వేదిక రాష్ట్ర కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి కడప అర్బన్



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సలావుద్దీన్

విజయవాడ లో ముస్లిం ఐక్య వేదిక రాష్ట్ర కార్యాలయాన్ని శుక్రవారం ముస్లిం ఐక్య వేదిక గౌరవాధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్, జియాల రెహమాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లిం సోదరులు సమస్యలు ముస్లిం ఐక్య వేదిక కార్యాలయం దృష్టి తీసుకురావాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళి పరిష్కరించడం కోసం కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్ర కార్యాలయం ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముస్లిం ఐక్య వేదిక నాయకులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

రథసప్తమికి ఏర్పాట్లు పూర్తి

చెన్నూరు : స్థానిక ప్రసన్న లక్ష్మి వెంకటేశ్వర స్వామి, లక్ష్మీ నగర్ లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో శనివారం నిర్వహించే రథసప్తమి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. సందర్భంగా తెల్లవారుజామున స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలతో పాటు ప్రత్యేకంగా అలంకరించనున్నారు. అనంతరం ఉదయం 10 గంటలకు కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు, అనంతరం 12 గంటలకు అన్నదానం, సాయంత్రం గ్రామోత్సవం ఉంటాయని పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రతీక శ్రీకృష్ణ దేవరాయలు

కడప అర్బన్ : ప్రజా సంక్షేమం, ప్రగతికి ప్రతీక శ్రీకృష్ణదేవరాయలు అని బలిజ సంఘం నాయకులు తుమ్మలకుంట శివశంకర్ అన్నారు. శుక్రవారం బలిజ ఆర్గనైజేషన్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుమలశెట్టి రఘురామ్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయలు 527 జయంతిని వైభవంగా నిర్వహించారు. కృష్ణ సర్కిల్ లోని శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన తుమ్మలకుంట శివ శంకర్ మాట్లాడుతూ సాహిత్య సాంస్కృతిక,సామాజిక ప్రగతికి రాయలు మార్గదర్శకం అన్నారు. శతాబ్దాల కిందట రాయలు చేసిన సంక్షేమాభివృద్ధి నేటికీ కొనసాగుతున్నాయన్నారు. రాయలు ముందు చూపుతో తవ్వించిన బావులు,చెరువులు నేటికి మనం ఉపయోగించుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బలిజ నాయకులు శ్రీనివాసులు,తోట రామచంద్రయ్య, లక్ష్మీ నారాయణ,రమణ,హరి రమేష్,పైడికాల్వ పెద్దోడు,మస్తాన్ రావు,క్రాంతి కుమార్,ప్రదీప్, నాగముని,బాబులు, శివ కిరణ్, బలిజ కులస్తులు పాల్గొన్నారు. **పులివెందుల టౌన్:** పట్టణంలో ఘనంగా శ్రీకృష్ణదేవ జయంతిని నిర్వహించారు. శుక్రవారం శ్రీకృష్ణదేవరాయల జయంతి సందర్భంగా పాత పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు ప్రసాదు, కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు వెంకటసుబ్బయ్య, సోపాల వీర, శీను, కృష్ణకుమారు, ఓం ప్రకాష్, కార్తీక్ పాల్గొన్నారు.

2,700 టన్నుల యూరియా మంజూరు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాకు అవసరమైన 2,700 మెట్రిక్ టన్నుల యూరియా మంజూరై కడపకు చేరిందని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం రైల్వే వేగన్‌లో వచ్చిన యూరియాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలకు, డీలర్లకు యూరియా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. శనివారం మరిన్ని ఎరువులు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఎడిఎ సుబ్బారావు, మార్క్ ఫెడ్ డి ఎం.పరిమళా జ్యోతి, ఎంఎఒ సురేష్ కుమార్ రెడ్డి, ఏవో సుమంత్ రెడ్డి పాల్గొన్నారు.



యూరియా బస్తాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

ప్రభుత్వ ధరకు భూములు ఇవ్వలేం : రైతులు

ప్రజాశక్తి - చాపాడు



రైతులతో సమావేశమైన తహశీల్దార్

ప్రభుత్వం ఇచ్చే పరిహారం చాలా తక్కువ అని ఆ ధరకు తమ భూములు ఇవ్వలేమని మండల పరిధిలోని జడ్డిగారి కొట్టాలు గ్రామ రైతులు పేర్కొన్నారు. శుక్రవారం భూములు కోల్పోతున్న రైతులతో తహశీల్దార్ సుభాని సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిచ్చపాడు రెవెన్యూ పొలంలో జడ్డి గారి కొట్టాలు, ద్వారక నగరం గ్రామాల మధ్య కడప - కర్నూలు హైవే కలిసే చోట 93 ఎకరాలలో సర్కిల్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. అందులో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుంది అన్నారు. ప్రభుత్వ రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం రూ. 10 లక్షల వరకు పరిహారం చెల్లించే అవకాశం ఉందన్నారు. దీనిపై రైతులు స్పందిస్తూ కడప - కర్నూలు హైవే రహదారి వెంబడి ఎకరా రూ. 2 కోట్ల వరకు భూముల ధర పలుకుతున్నాయన్నారు. ప్రభుత్వం ఇస్తున్న నష్టపరిహారం చాలా తక్కువ అని ప్రభుత్వ ధరకు భూములు ఇవ్వలేమన్నారు. దీనితో ఏమైనా అభ్యంతరాలు ఉంటే రాత పూర్వకంగా అర్జీల ఇస్తే ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తహశీల్దార్ సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ కెపి రాజు, సర్వేయర్ సాయిలత, విఆర్ఓ సుబ్బన్న, సచివాలయ సర్వేయర్ సౌందర్య, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం రావడం తథ్యమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇండియా టుడే - సి ఓటర్ నిర్వహించిన మూడ్ ఆఫ్ ది నేషన్ తాజా సర్వేలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిపితే కాంగ్రెస్ పార్టీకి 191 సీట్లు వస్తాయని చెప్పడం ఆనందంగా ఉందని చెప్పారు. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పుంజుకుంటున్నట్టు చెప్పారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 52 లోక్ సభ సీట్లు మాత్రమే వచ్చినట్లు చెప్పారు. గత ఎన్నికల కంటే 139 సీట్లు పెరుగుతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బిజెపి పాలన పట్ల ప్రజలు పూర్తిగా విసిగి పోయారని చెప్పారు. ధరలు సామాన్యులకు అందుబాటులో లేవని వాపోయారు. నిరుద్యోగం కూడ విపరీతంగా పెరిగిందని చెప్పారు. రాష్ట్రంలో వైసిపి పరిస్థితి రోజురోజుకూ క్షీణిస్తోందని అన్నారు. 2023 జనవరిలో ప్రశాంత్ కిషోర్ కు చెందిన ఐ-ప్యాక్ నిర్వహించిన సర్వేలో 25 మంత్రులలో 20 మంది ఓడిపోతారని, 13 మంది మాజీ మంత్రుల్లో 11 మంది ఓడిపోతారని తేలడం కన్పిస్తుంది అన్నారు. ప్రత్యేక హోదాను కానీ, విభజన చట్టం లోని అంశాలను కాని అమలు చేసే శక్తి ప్రాంతీయ పార్టీలకు లేదన్నారు, ఒక కాంగ్రెస్ పార్టీకి మాత్రమే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని చెప్పారు. కాబట్టి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్న ఆశా భావాన్ని తులసిరెడ్డి వ్యక్తం చేశారు.

జంతువులను మానవత్వంతో చూడాలి

ప్రజాశక్తి- జమ్మలమడుగు



బహుమతులు ప్రదానం చేస్తున్న డాక్టర్ జాన్ సుధాకర్

జంతువులను మానవత్వంతో, కరుణతో చూడడం మన నైతిక బాధ్యత అని జమ్మలమడుగు పశుసంవర్ధక శాఖ డాక్టర్ జాన్ సుధాకర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని గూడెం చెరువులో ఉన్న కెజిబివి పాఠశాలలో విద్యార్థులకు జంతు సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని జంతు జీవితాలను దయ, కరుణతో గౌరవించేలా చూడడం పౌరుల బాధ్యత అన్నారు. జనవరి 14 నుంచి 30 వరకు జంతు సంక్షేమ పక్షం నిర్వహించుకుంటున్నామని తెలిపారు. తమ దూరాల కోసం జంతు జీవాలను దుర్వినియోగం చేయరాదని చెప్పారు. అనంతరం జంతు సంరక్షణ అంశంపై విద్యార్థులకు వ్యాసరచనా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి వెల్ఫేర్ అసిస్టెంట్ తిరుపతిరెడ్డి, స్కూల్ ప్రిన్సిపల్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన

పులివెందుల రూరల్ : పులివెందుల మోడల్ టౌన్ లో భాగంగా నిర్మిస్తున్న అభివృద్ధి పనులను జాయింట్ కలెక్టర్ సాయి కాంత్ వర్మ, పాడా ఒఎస్డి అనిల్ కుమార్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శుక్రవారం నగరవనం, గరండాల్, స్పోర్ట్ కాంప్లెక్స్, ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించారు. సందర్భంగా జెసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల వరకు పులివెందుల మోడల్ టౌన్ లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను సూచించారు కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, తహశీల్దార్ మాధవ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి దాతల విరాళం

చక్రాయపేట: గండి క్షేత్రంలోని శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో చేపట్టిన శాశ్వత నిత్యాన్నదానం పథకానికి రూ. 2,25,580 దాతలు విరాళాలు అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముకుందరెడ్డి, చైర్మన్ రాఘవేంద్రప్రసాద్ చెప్పారు. శుక్రవారం గండి క్షేత్రంలో వేంపల్లెకు చెందిన డాలర్ సుబ్బారెడ్డి సతీమణి శారద రూ. 1, 00,116 , హైదరాబాద్ కు చెందిన కోగటం రామచంద్రారెడ్డి రూ. 50, 116 వేలు, రామసుబ్బారెడ్డి సతీమణి సుజాత రూ. 25,116, కడపకు చెందిన చంద్రమోహన సతీమణి తులసమ్మ రూ. 25, 116, చింతలమడుగుపల్లెకు చెందిన సింగారెడ్డి అరుణ్ కుమార్ రెడ్డి రూ. 25116 ఇచ్చినట్లు తెలిపారు. విరాళాలు ఇచ్చిన దాతలకు ఆలయ అర్చకులు కేసరిస్వామి, రాజా స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వంద శాతం ఉత్తీర్ణతకు కృషి

ఖాజీపేట : ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంతోపాటు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని, రాబోయే పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా పరిషత్ కో - ఆప్షన్ సభ్యులు అబ్బు కరీముల్లా అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భోజనాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు అందరూ కష్టపడి కృషి చేయాలని విద్యార్థులు అందుకు అనుగుణంగా తీర్చిదిద్దాలన్నారు. మధ్యాహ్నం భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు అందించే జగనన్న గోరుముద్ద నాణ్యతగా ఉండాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి క్రమశిక్షణతో కూడిన విద్యను అందించేలా అంకితభావంతో పనిచేయాలని చెప్పారు. ఆయన వెంట స్థానిక వైసిపి నాయకులు గోపాల్ రెడ్డి ఉన్నారు.

వెలుగు నింపడంలో ఎలక్ట్రీషియన్ల కీలకం

ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా

ప్రజాశక్తి - కడప



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా

ఎన్నో అద్భుతాలు మరెన్నో ఆవిష్కరణలు ప్రపంచాన్ని మరింత వెలుతురులు నింపడంలో ఎలక్ట్రీషియన్లు కీలకమని ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా, వైఎస్ఆర్ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్ పేర్కొన్నారు. ఎలక్ట్రీషియన్స్ ఫ్రంటింగ్ వర్కర్స్ ఆత్మీయ సమ్మేళన సమావేశం ఎలక్ట్రీషియన్స్ డే సందర్భంగా శుక్రవారం నగరం లోని నూర్జహాన్ ఫంక్షన్ హాల్లో జిల్లా ఎలక్ట్రీషియన్స్ అధ్యక్షులు పవర్ అల్తాఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు ఎలక్ట్రిషియన్లు తమ వృత్తికి ఏ విధంగా న్యాయం చేస్తున్నారో తెలియజేశారు అసోసియేషన్లకు అన్ని విధాలుగా ప్రభుత్వ పరంగా, వ్యక్తిగతపరంగా తాము ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తా మని తెలియ జేశారు.. అనంతరం లక్కీ డిప్ ద్వారా ఎలక్ట్రీషియన్లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు మార్కెట్ కమిటీ డిప్యూటీ చైర్మన్ మియా, కాల్ టెక్స్ హఫీజులా, ఎలక్ట్రిషన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పవర్ అల్తాఫ్, అడ్వైసర్ నాగేశ్వర రావు, చిట్టి, మల్లికార్జున, శర్మ, మహబూబ్ షరీఫ్, వెంకట సుబ్బయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి కార్మికుడికీ బీమా తప్పనిసరి : సిఐ

వేంపల్లె : ప్రతి విద్యుత్ కార్మికుడూ బీమా కల్గి ఉండాలని సిఐ వెంకటేశ్వర్లు చెప్పారు. ఎలక్ట్రిషియన్ డే సందర్భంగా శుక్రవారం వేంపల్లె ప్రయివేటు ఎలక్ట్రిషియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక మెయిన్ బజార్లో ఏర్పాటు చేసిన జెండాను సిఐ వెంకటేశ్వర్లు ఎగుర వేశారు. సీనియర్ ఎలక్ట్రీషియన్స్ కార్మికులను శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా సిఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మానవ జాతిని ప్రభావితం చేసిన విద్యుత్ బల్బు, ఫోనోగ్రాఫ్ లాంటి అనేక ఉపకరణాలను రూపొందించిన ఒక గొప్ప అమెరికన్ శాస్త్రవేత్త, వ్యాపారవేత్త థామస్ ఆల్వా ఎడిసన్ అన్నారు. ప్రాణాలను సైతం తెగించి విధులు నిర్వహిస్తున్న ఎలక్ట్రిషన్ కార్మికుల సమస్యలను తమ వంతు కృషి చేస్తానని చెప్పారు. ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మునికుమార్ మాట్లాడుతూ ఎలక్ట్రీషియన్స్ కార్మికులు అందరూ ఐక్యంగా ఉండి సమస్యలు కోసం పోరాటం చేయాలని కోరారు. కార్మికుల అందరితో కలిసి ఎలక్ట్రీషియన్స్ వేడుకలను చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ సభ్యులు అందరూ కలిసి సిఐ వెంకటేశ్వర్లును శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు అబ్దుల్ హకీం, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ గౌస్, సహాయ కార్యదర్శులు యస్దాన్, బాబాఫకృద్దీన్, కోశాధికారి బాబా ఫకృద్దీన్, జిలాన్ బాషా, రాజు, ధనుంజయ, నాగిరెడ్డి, అల్లాబకష్, ముబారక్, రమేష్, షబ్బీర్, అహమ్మద్ పాల్గొన్నారు. **పులివెందుల టౌన్ :** రక్తదానం అన్ని దానాల కన్నా మిన్న అని రక్త నిధి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దివ్యశ్రీ, ఎస్ఐ చిరంజీవి అన్నారు. శుక్రవారం ఎలక్ట్రీషియన్ డే 4వ వార్షికోత్సవం సందర్భంగా పులివెందుల ప్రయి లవేట్ ఎలక్ట్రీషియన్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో పట్టణంలోని వైయస్ఆర్ ఉర్దూ షాధీఖానాలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 40 మంది ఎలక్ట్రీషియన్లు రక్తదానం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు సుభాన్, రాము, ఓబులేసు, శివప్ప, వరదరాజా, బాబాజీ, రక్తనిధి సిబ్బంది ల్యాబ్ టెక్నీషియన్ మహమ్మద్ రఫీ, హనుమకుమార్, అన్నమ్మల్, జయశ్రీ, చంద్రకళ, చిలకమ్మ, సుందర్ రాజు, నరసింహ, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు పాల్గొన్నారు.

సభ్యుల సహకారంతో మున్సిపాల్టీ అభివృద్ధి

- చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ

ప్రజాశక్తి- జమ్మలమడుగు



సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న కౌన్సిలర్ ముల్లాజానీ, ఇన్‌సెట్‌లో చైర్‌పర్సన్

కౌన్సిల్‌లో ఉన్న సభ్యులందరూ సహకారంతో జమ్మలమడుగు మున్సిపాలిటీ అభివృద్ధి పథంలోకి నడిపేందుకు కృషి చేస్తామని జమ్మలమడుగు నగర పంచాయతీ చైర్పర్సన్ వేల్పుల శివమ్మ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం జమ్మలమడుగు నగర పంచాయతీ బడ్జెట్ సమావేశం కౌన్సిల్ హాల్ నందు నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పంచాయతీకి సంబంధించి 2022- 23 సంవత్సరానికి సవరించిన బడ్జెట్, 2023-24 సంవత్సరానికి తయారుచేసిన అంచనా బడ్జెట్‌ను సమావేశంలో కౌన్సిల్ సభ్యులందరూ ఆమోదం తెలిపారు. మొదటగా కౌన్సిలర్ ముల్లా జానీ మాట్లాడుతూ వికలాంగులకు 2023- 24 బడ్జెట్లో రూ. 0.69 లక్షలు కేటాయించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతి వార్డు నుండి వికలాంగులను గుర్తించి ట్రై సైకిళ్లను అందించేందుకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదాన్ని తెలిపింది. సమస్యలున్నచోట ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి గడపగడప కార్యక్రమం పెట్టడం లేదని బిజెపి కౌన్సిలర్ చెప్పగా ఇప్పటివరకు పట్టణంలో సమస్యలున్నచోటే ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నారని ముల్లా జానీ చెప్పారు. కౌన్సిలర్ పోచిరెడ్డి మాట్లాడుతూ మెప్మా కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో చెత్తాచెదారం నిల్వ ఉందని నగర పంచాయతీ అధికారులు వెంటనే కాంపౌండ్ వాల్ నిర్మించి పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి. వెంకట్రామిరెడ్డి, వైస్ చైర్మన్ పోరెడ్డి రామలక్ష్మమ్మ, మంగదొడ్డి సింగరయ్య, కౌన్సిలర్లు పోచిరెడ్డి, ముని సుబ్బారెడ్డి, లక్ష్మీ ప్రసన్న, షామీర్, గౌరీ, కో-ఆప్షన్ సభ్యులు లక్ష్మయ్య, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి



ఉద్యోగులతో మాట్లాడుతున్న శ్రీనివాసులు రెడ్డి

ప్రజాశక్తి-పులివెందుల రూరల్

ఎపిలో కాంట్రాక్టు ఉద్యోగ వ్యవస్థను రద్దుచేసి, విద్యాశాఖలో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులందరినీ క్రమబద్ధీకరించాలని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పులివెందులలోని బాలికల జూనియర్ కళాశాల, బాలికల డిగ్రీ కళాశాల , బాలుర జూనియర్ కళాశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా అధ్యాపకుల సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాంట్రాక్ట్ వ్యవస్థ రద్దు అవుతుందని ఉద్యోగులందరూ వేయికళ్లతో ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం మాత్రం ఆ దిశగా అడుగులు వేయకపోవడం బాధాకరమని వాపోయారు. ఒరిస్సా తరహాలో రాష్ట్రంలో కాంట్రాక్టు వ్యవస్థని రద్దు చేసి వారి సర్వీసును క్రమబద్ధీకరించి రెగ్యులర్ ఉద్యోగులుగా మార్చాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణకు అడుగులు వేస్తున్నారని మరి మన రాష్ట్రంలో కాంట్రాక్టు వ్యవస్థ ఎప్పుడు రద్దువుతుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సిపిఎస్ రద్దు చేస్తారని ఆశతో ఉన్న ఉద్యోగుల కోసం సిపిఎస్ రద్దు చేసి పాత పింఛను పథకాన్ని అమలు చేయాలన్నారు. డిగ్రీ అధ్యాపకులకు అసిస్టెంట్ ప్రొఫెసర్ అసోసియేట్ ప్రొఫెసర్లుగా హోదా కల్పించాలన్నారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డైట్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ గజ్జల వేమనారాయణరెడ్డి, విశ్రాంత వ్యాయామ అధ్యాపకులు కోటా ఓబుళరెడ్డి, అధ్యాపకులు రామసుబ్బయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు ఓబుళరెడ్డి, విజయ ప్రసాద్ రెడ్డి, శ్రీనివాసులు, కిరణ్, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న సిఎస్ఒ రామునాయక్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సిఎస్ఒ రాము నాయక్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలోని సభా భవనంలో నియోజకవర్గంలోని జమ్మలమడుగు అర్బన్, రూరల్, ముద్దనూరు, పెద్దముడియం, మైలవరం, కొండాపురం, ఎర్రగుంట్ల అర్బన్, రూరల్ హౌసింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ఒ మాట్లాడుతూ ప్రతి వారానికీ పనిలో అభివృద్ధి కనపడాలన్నారు. జిల్లాలో జమ్మలమడుగు నియోజకవర్గం జగనన్న ఇళ్ల నిర్మాణంలో ముందంజలో ఉందన్నారు. మైలవరం, జమ్మలమడుగు రూరల్, కొండాపురం ప్రాంతాలలో కొంత వెనుకబడి ఉందని, అక్కడి అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వచ్చే వారానికి అభివృద్ధి కనపడాలన్నారు. అనంతరం డిఇ విజయ్ బాబు, స్పెషల్ అధికారి ఖాదర్ బాషా మాట్లాడుతూ సోమవారం గృహ నిర్మాణాలపై సమీక్ష ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆరు మండలాల హౌసింగ్ అధికారులు, తహశీల్దార్, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

వేంపల్లె : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిపి లక్ష్మి గాయత్రీ, సర్పంచి రాచినేని శ్రీను వాసులు కోరారు. శుక్రవారం సాయంత్రం వేంపల్లె పంచా యతీలోని చింతలమడుగుపల్లె సమీ పంలోని జగనన్న కాలనీని అధికారులతో కలిసి వారు పరిశీలి ంచారు. లబ్ధిదారులతో ఇంటి నిర్మాణాలపై చర్చించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ పేదల సొంత ఇంటి కలను నేరవేర్చుందుకు స్థలాలు మంజూరు చేశారని చెప్పారు. ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 1.80 లక్షలు లబ్ధిదారుల ఖాతాలో వేస్తుందని తెలిపారు. లక్షలాది రూపాయలు విలువ చేసే స్థలాన్ని లబ్ధిదారులకు ఇవ్వడం జరిగిందని చెప్పారు. త్వరితగతిన ఇంటి నిర్మాణాలను లబ్ధిదారులు పూర్తి చేసేందుకు పనులు చేపట్టాలని కోరారు. ఇంటి నిర్మాణం పనులు చేయక పోతే ఇంటి స్థలాలను రద్దు చేస్తామని తహశీల్దార్ చంద్ర శేఖర్‌రెడ్డి చెప్పారు. కాలనీలో విద్యుత్, తాగునీరు, రోడ్లు లాంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల స్పెషల్ అధికారి డాక్టర్ రవీంద్రా రెడ్డి, ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డి, హౌసింగ్ ఏఈ సుకు మార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రవి శంకర్‌రెడ్డి, ఎంపిటిసి రహంతుల్లా ఖాన్, మండల కొఆప్షన్ మెంబర్ అసనయ్య, వార్డు మెంబర్ ఉమర్, మాజీ ఎంపిటిసి గంగరాజు, సచివాలయ అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి అన్నం తింటున్న ప్రభాకర్ రెడ్డి

'పది'లో మెరుగైన ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

రాబోయే పది పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మన బడి నాడు - నేడు పనులను శుక్రవారం సమగ్ర శిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రశేఖర్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం జగనన్న గోరుముద్దను తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన బడి నాడు నేడు ద్వారా చేపట్టిన పనులను వేగవంతం చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలన్నారు. మొదటి దశలో నాబార్డ్ ద్వారా మంజూరైన రూ. 97 లక్షల నిధులతో మౌలిక వసతుల పనులు జరుగుతున్నాయన్నారు. మనబడి నాడు నేడు కింద రెండవ దశలో రూ.36 లక్షలతో మూడు అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నామని చెప్పారు. పనుల్లో, భోజనంలో నాణ్యత లోపించకూడదని అధికారులకు సూచించారు. అనంతరం స్టేషన్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. మౌలిక వసతులు, తరగతి గదులు ,మరుగుదొడ్లు పరిశీలించారు. విద్యార్థుల చదువును, ఉపాధ్యాయులు బోధనా తీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంఇఒ విజయ భాస్కర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సుధాకర్, ఉపాధ్యాయులు, సిఆర్‌పి తిరుపతయ్య పాల్గొన్నారు.

క్వింటాకు రూ.25 కూలి చెల్లించాలి

వేంపల్లె : ప్రభుత్వ రేషన్ గౌడన్‌లో పని చేసే హమాలీలకు క్వింటాకు రూ. 25 చెల్లించాలని ఆ సంఘం నాయకుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం వేంపల్లెలోని సివిల్ సప్లయ్‌కు చెందిన రేషన్ గౌడన్ వద్ద హమాలీలు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రూ. 22 మాత్రమే ఇస్తుందని దీంతో తమ కుటుంబాలపై ఆర్థిక భారం పడుతోందని చెప్పారు. కూలి రేట్లు పెంచాలని గతంలో ఎన్నో సార్లు ప్రభుత్వానికి విన్నవించినా ఫలితం లేదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం క్వింటాకు రూ. 25 ఇస్తామని చెప్పినప్పటికీ జీవో మాత్రం జారీ చేయలేదని అన్నారు. . జీవో జారీ చేయక పోతే ఫిబ్రవరి నెలలో రేషన్ బియ్యం రవాణా పనులు నిలిపి వేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హమాలీ కూలీలు ఓబులేసు, శివ, లక్షుమయ్య, గంగులయ్య, వెంకటశివయ్య, ఓబులేసు పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి

వేంపల్లె : మండలంలోని ప్రతి ఓటరూ తమ ఓటు కార్డులకు ఆధార్ కార్డు అనుసంధానం చేసుకోవాలని తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఓటుకు ఆధార్ నెంబర్ అనుసంధానం చేసుకోక పోతే సంబంధిత బూత్ లెవల్ అధికారి వద్ద వెళ్లి అనుసంధానం చేసుకోవాలని కోరారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద కూడ ఓటుకు ఆధార్ అనుసంధానం చేస్తారని చెప్పారు. ప్రతి ఓటరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైసిపి పతనానికి తొలి అడుగు

జమ్మలమడుగు రూరల్ : వైసిపి ప్రభుత్వ పత నానికి నారా లోకేష్ తొలి అడుగు వేశారని జమ్మలమడుగు టిడిపి నాయకులు సంయుక్తంగా పేర్కొ న్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాల యంలో నారా లోకేష్ యువగళం పేరుతో ప్రారంభమైన పాదయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ ఐటిడీపీ అధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం పాదయాత్ర విజయ వంతంగా పూర్తి కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షుడు దువ్వూరు మురళి, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి నవీన్ రాయల్, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యనిర్వహక కార్యదర్శి ఖదీర్, జిల్లా అధికార ప్రతినిధి పొన్నతోట శ్రీనివాసులు, జిల్లా రైతు ప్రధాన కార్యదర్శి పోన్నతోట మల్లి ఖార్జున, టిడిపి నాయకుడు ఐ.ఎల్ చిన్న, జిల్లా ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు సయ్యద్, జిల్లా ముస్లిం మైనారిటీ అధికార ప్రతినిధి మహమ్మద్ రఫీ, జిల్లా ఎస్.సి సెల్ అధికార ప్రతినిధి జయ చంద్ర, జిల్లా నందమూరి సంఘం కన్వీనర్ సూర్య రాయల్, క్లస్టర్ ఇన్‌ఛార్జి రాజా రెడ్డి, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షుడు పిలిప్, ముస్లిం మైనారిటీ టౌన్ సెక్రటరీ దాదాపీర్, సురేంద్ర, భాస్కర్, షబ్బీర్, జి.కె గైబు, నజీర్, చెన్నయ్య, మధు, రసూల్ నాయక్, డ్రైవర్ బుజ్జి పాల్గొన్నారు.

జమున మరణం తీరని లోటు



హైదరాబాద్‌లో కలిసిన సందర్భంగా (ఫైల్‌ఫోటో)

ప్రొద్దుటూరు: సినీ సత్యభామగా పేరుగాంచిన సీనియర్ నటి జమున మరణం సినీ జగత్తుకు తీరని లోటని పుట్టపర్తి సాహితీపీఠం కార్యదర్శి జింకా సుబ్ర హ్మణ్యం పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తెలుగు తెరపై పౌరాణిక చిత్రాలలో సత్య భామగా నటించారని చెప్పారు. అలనాటి మరుపురాని చిత్రాలు లేతమనుషులు, దొంగ రాముడు, పండంటికాపురం, మిస్సమ్మ, ఇల్లరిక, గుండమ్మకథ ,శ్రీకృష్ణతులాభారం, గుళేభకావలిక థ వంటి చిత్రాలు కలకాలం అభిమానుల హృదయాలలో నిలిచి పోతాయన్నారు. పార్లమెంట్ సభ్యురాలిగా ఉండి కళాకారులకు ఎంతో సేవచేశారని కొనియాడారు. కడప సవేరా వేడుకల్లో పాల్గొన్నారని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో పలు సందర్భాలలో ఆమెను కలుసుకున్నట్లుగా జింకా తెలిపారు. **జమున మృతి బాధాకరం..** ప్రముఖ సినీనటి, పార్లమెంటు మాజీ సభ్యురాలు జమున మృతి చెందడం బాధాకరమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సినీ రంగంలో జమున విలక్షణమైన నటి అన్నారు. సత్యభామ అంటేనే జమున జ్ఞాపకం వస్తారని చెప్పారు. గుండమ్మ కథ, మిస్సమ్మ, మూగ మనుషులుతో పాటు ఆయా సినిమాల్లో నటించి అందరి మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచారని చెప్పారు.

క్రైం కార్నర్

కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - కడప అర్బన్

కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న శివరాం అనే వ్యక్తిని పోలీసుల అరెస్ట్ చేశారని అదనపు ఎస్‌పి తుషార డూడి తెలిపారు. శుక్రవారం కో-ఆపరేటివ్ కాలనీలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైదుకూరు జాతీయ రహదారి రావులపల్లి క్రాస్ వద్ద ఎన్ఫోర్స్‌మెంట్, డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ సంయుక్త వాహనాల తనిఖీ నిర్వహించారని తెలిపారు. కారులో కర్ణాటక నుంచి అక్రమ మద్యం తరలిస్తున్న బ్రహ్మంగారి మఠంకు చెందిన ఇండ్ల నిత్య శివరాం అనే వ్యక్తి అరెస్ట్ చేశారని పేర్కొన్నారు. నిందితుడి వద్ద నుంచి రూ.1.6 లక్షల విలువైన వివిధ రకాల కర్ణాటక మద్యం బాటిళ్లు, రూ.8 లక్షల విలువైన మహీంద్రా టివియు కారు స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ టి.విజయ్‌శేఖర్, ఎస్ఇబి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌పి ఎస్.శ్రీనివాస్, ఫ్యాక్షన్ జోన్ డిఎస్‌పి చెంచుబాబు, టాస్క్ ఫోర్స్ సిఐ పురుషోత్తం, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐ విశ్వనాథ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. పెద్ద ఎత్తున అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్న ఎస్ఇబిమి అధికారులు, సిబ్బందిని ఎఎస్‌పి అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు.

పోలీసుల అదుపులో దొంగ

టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న అక్బర్ అలీ అనే దొంగను పోలీసులు అరెస్ట్ చేశారని డిఎస్‌పి వెంకట శివారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం డిఎస్‌పి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగ నుంచి సుమారు రూ.4 లక్షలు విలువగల బంగారు, వెండి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుడు పలు పోలీస్ స్టేషన్‌లలో 5 కేసులలో నిందితుడిగా ఉన్నారని చెప్పారు. సమావేశంలో టూ టౌన్ సిఐ సయ్యద్ హాసం, ఎస్ఐ ఎన్.ఎస్ రాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



మెరుగైన వైద్య సేవలందించాలి 'గడికోట'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించి అందరి మన్ననలను పొందాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఉదయ శివారెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన శ్రేయాన్స్ కంటి ఆస్పత్రిని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ఆధునిక వసతులతో ఆస్పత్రులు ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ నారాయణరెడ్డి, ప్రముఖ కాంట్రాక్టర్ ఇందిరారెడ్డి, శివప్పరెడ్డి, యువజన విభాగపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరం వెంకట సుబ్బారెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి

స్వాతంత్ర్యోద్యమానికి దశదిశ నిర్దేశించింది పత్రికలే

ఎస్వీయూ రిటైర్డ్ ఆచార్యులు మేడిపల్లి రవికుమార్



మాట్లాడుతున్న ఎస్వీయూ రిటైర్డ్ ఆచార్యులు రవికుమార్

ప్రజాశక్తి-పీలేరు

సుదీర్ఘకాలం సాగిన భారత స్వాతంత్ర్యోద్యమానికి దశదిశ నిర్దేశించి ఉద్యమకారులను ఏకీకరణ చేసింది ఆనాటి పత్రికలేనని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ తెలుగు శాఖ విశ్రాంత ఆచార్యులు మేడిపల్లి రవికుమార్ తెలిపారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ రీసెర్చ్ (ఐసిఎస్ఎస్ఆర్) సౌజన్యంతో పీలేరు సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం 'భారత స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు పత్రికలు, జర్నలిజం పాత్ర' అనే అంశంపై ప్రారంభమైన రెండు రోజుల జాతీయ సదస్సులో ఆయన కీలక ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు దేశంలోని వివిధ ప్రాంతాల్లో, వివిధ రూపాల్లో జరుగుతున్న స్వాతంత్ర పోరాటానికి జాతీయోద్యమ రూపునిచ్చి ఉద్యమ లక్ష్యం పక్కదారి పట్టకుండా దిశా నిర్దేశం చేసింది పత్రికలేనన్నారు. పురాణాలు, ఇతిహాసాల వల్ల సాధ్యం కాని జాతి ఏకీకరణ పత్రికల ద్వారానే సాధ్యమైందని, కేవలం స్వాతంత్ర సాధన ఏకైక లక్ష్యంతో, స్వాతంత్ర ఉద్యమ ప్రచారానికి ఆవిర్భవించిన అనేక పత్రికల ద్వారా స్వాతంత్ర సాధన కాసింత సులభమైందన్నారు. సాంకేతికత ఏమాత్రం లేని ఆ రోజుల్లో పత్రికలు లేకుంటే స్వాతంత్ర్య సాధన మరికొన్ని దశాబ్దాల పాటు ఆలస్యమయ్యేదని అభిప్రాయపడ్డారు. దేశం కోసం ఆవిర్భవించిన పత్రికల్లో పనిచేసిన జర్నలిస్టులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా బ్రిటీష్ వారి నిర్బంధాల మధ్య ఉద్యమ గమనాన్ని, స్థితిగతులను ప్రజలకు నిర్భయంగా తెలియజేశారన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ ఆంగ్ల శాఖాధ్యక్షులు ఆచార్య పెద్ది హరి పద్మారాణి మాట్లాడుతూ కేవలం దేశభక్తిని ప్రచారం చేయడం కోసమే నాడు అనేక పత్రికలు ఆవిర్భవించాయని తెలిపారు. కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జింక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దేశ ప్రజలను, కుటుంబ సభ్యుల మార్పు స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వాములను చేసిన ఘనత ఆనాటి పత్రికలదేనన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు శాఖ సహాయాచార్యులు డాక్టర్ రఘు మాట్లాడుతూ గతంలో దేశ ప్రయోజనాలే పరమావధిగా పనిచేసిన పత్రికలు ప్రస్తుతం తమ అవలంబిస్తున్న ధోరణిపై తులనాత్మక సమీక్ష చేసుకోవాలని సూచించారు. విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ సమరం రామచంద్రారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమ సమయంలోని తెలుగు పత్రికల ద్వారా దేశానికి ఎన్‌జి రంగ, తెన్నేటి విశ్వనాథం, బెజవాడ గోపాలరెడ్డి వంటి మహోన్నత నాయకులు దొరికారన్నారు. సదస్సు సమన్వయకర్త పీలేరు డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు కరణం శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ మానవ జీవిత పరిణామ క్రమాన్ని సక్ర మదిశలో నడిపే ఆలోచనల మధనానికి వేదికగా నిలిచే అనేక సామాజిక, శాస్త్రీయ ఆవిష్కరణలకు పత్రికలు వేదికలుగా నిలిచాయన్నారు. అనంతరం దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సదస్సుకు హాజరైన అధ్యాపకులు, విద్యార్థులు సమర్పించిన పత్రాలతో ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపిజిసిజిటిఎ అధ్యక్షులు నరసింహులు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ శివారాంరెడ్డి, అధ్యాపకులు రమేష్ చంద్రబాబు, వెంకటరత్నం, కవిత, రజని, వెంకట రమణయ్య, సంధ్య, నారాయణస్వామి, సైపుల్లా, కిషోర్ కుమార్‌రెడ్డి, తిరుపాల్‌రెడ్డి, ఎర్రయ్య, రామచంద్ర, రాంబాబు, సుధాకర్‌రెడ్డి, రామకృష్ణ, ధరణినాథరెడ్డి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం అవసరం

- జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



సైన్స్ ఎగ్జిబిషన్‌లో నమూనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకత శక్తి వెలుగులోకి వస్తుందని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సాయి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నుండి రెండు రోజుల పాటు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలనతో ఈ సైన్స్ పండగ అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ చిన్ననాటి నుండే సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. వైజ్ఞానిక ప్రదర్శన విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకతకు సాన పెట్టే విధంగా ఉండాలన్నారు. వినూత్న ఆలోచనలతో సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యార్థులు అత్యున్నత స్థానానికి ఎదగాలన్నారు. గురువులపైనే విద్యార్థుల భవిష్యత్ ఆధారపడి ఉంటుందని, చిన్ననాటి నుంచే విద్యార్థులలో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాలని పేర్కొన్నారు. దేశ అభివృద్ధి చెందాలంటే సైన్స్‌తోనే అది సాధ్యమవుతుందన్నారు. మానవ మనుగడకు సైన్సు ఎంతగానో ఉపయోగ పడుతోందన్నారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా విద్యార్థులు పరిశీలించటం అలవాటు చేసుకోవాలని అప్పుడే మనం అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. ఏపిజె అబ్దుల్ కలాం, సర్ సివి రామన్, కల్పనా చావ్లా, సునీతా విలియమ్స్ తదితర మహోన్నత వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వం విజ్ఞాన శాస్త్ర అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీసేందుకు, సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లను నిర్వహించడం అభినందనీయమన్నారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష మాట్లాడుతూ విద్యా రంగానికి జగన్ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. సైన్స్ పట్ల విద్యార్థులు చిన్ననాటి నుంచే మక్కువ పెంచుకోవాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎద్దుల రాఘవరెడ్డి మాట్లాడుతూ విద్య అంటే కేవలం మార్కుల సాధనే కాదని, జ్ఞానం, నూతన పరిశోధనల పట్ల జిజ్ఞాస పెంచుకోవటమన్నారు. విద్యార్థులు స్వేచ్ఛగా ఆలోచించే విధంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మార్గదర్శనం చేయాలని సూచించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో అన్నమయ్య జిల్లానే మొట్టమొదటగా సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మండలానికి ఐదు చొప్పున 30 మండలాల నుండి 150 ప్రాజెక్టులు వచ్చాయన్నారు. వీటిలో ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు పంపనున్నట్లు చెప్పారు. విద్యార్థినీ విద్యార్థులకు, వారి గైడ్ టీచర్లకు వేరువేరుగా ఉచిత భోజనం, వసతి ఏర్పాటు చేశామన్నారు. సమావేశం అనంతరం విద్యార్థుల ప్రాజెక్టులను డిఇఒ ఇతర అధికారులతో కలిసి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు. ప్రాజెక్టుల విశేషాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, కౌన్సిలర్లు సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, సుగవాసి శ్యామ్, పిఆర్‌టియు రాష్ట్ర క్రమశిక్షణ సంఘ చైర్మన్ శ్రీనివాసరాజు, స్కౌట్స్ జిల్లా సెక్రెటరీ మడితాటి నరసింహా రెడ్డి, వైఎస్ఆర్‌టిఎఫ్ నేత రెడ్డెప్పరెడ్డి, సాయి విద్యా సంస్థల డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, వైసిపి నాయకులు జావీద్, అమీర్ పాల్గొన్నారు.

ఎల్‌ఎంటిఎస్‌ను ప్రారంభించిన ఎస్‌పి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

లాస్ట్ మొబైల్ ట్రేసింగ్ సిస్టమ్(ఎల్‌ఎంటిఎస్)ను ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సెల్ ఫోన్ ప్రజల జీవన విధానంలో ఒక ముఖ్యమైన భాగంగా మారిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ స్మార్ట్ ఫోన్లలో విలువైన సమాచారాన్ని దాచుకుంటున్నారన్నారు. ప్రజలు అధిక ధరలు పెట్టి స్మార్ట్ ఫోన్లు పోగొట్టుకోవడం తరచుగా చూస్తున్నామని చెప్పారు. దీన్ని అరికట్టే విధంగా సెల్‌ఫోన్ పోయిన వ్యక్తులు తమ విలువైన సమాచారాన్ని కోల్పోయి ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను గమనించి లాస్ట్ మొబైల్ ట్రేసింగ్ సిస్టమ్‌ను ప్రారంభించామన్నారు. జిల్లాలోని ప్రజలు ఎవరైనా తమ మొబైల్ ఫోన్ చోరీకి గురైనా, పోగొట్టుకున్నా జిల్లా పోలీసులు రూపొందించిన వెబ్‌సైట్ https://forms.gle/CCWgUgkATEbses4B9 లేదా 8688830012 మొబైల్ నెంబర్‌కు వాట్సాప్ ద్వారా హాయ్ అని మెసేజ్ చేయాలని పేర్కొన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే జిల్లా లాస్ట్ మొబైల్ ట్రేసింగ్ టీం సభ్యులు ఫిర్యాదు చేసిన వ్యక్తికి మొబైల్ వివరాలు సేకరించి పోయిన మొబైల్ ఫోను వెతికి అప్పగిస్తారని సూచించారు. ప్రజల అవసరార్థం రూపొందించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని దీన్ని సరదాగా లేదా ఆకతాయితంగా ఫిర్యాదు పంపినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు

పాఠశాలకు కంప్యూటర్లు వితరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కురబలకోట మండలంలోని పిచ్చలవాండ్లపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు రిటైడ్ ప్రధానోపాధ్యాయులు జివి ప్రసాద్ వద్ద విద్యను అభ్యసించిన మణికంఠ, భార్గవ్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి కలిసి పాఠశాలకు విద్యా సామగ్రి, కంప్యూటర్, మైక్ సెట్, బీరువాలు వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత ఆశయాలను అధిరోహించాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞుడైన ఉపాధ్యాయులతో విద్యాబోధన ఉంటుందని తెలిపారు. విద్యతో పాటు సాంకేతికతను విద్యార్థులు పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. అనంతరం మండల విద్యా శాఖాధికారి కె.ద్వారకనాథ్, ముదివేది జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం చంద్రశేఖర్, సర్పంచ్ సురేంద్ర, రిటైడ్ ప్రధానోపాధ్యాయులు జివి ప్రసాద్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రశేఖర్, చైర్మన్ చిన్నరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ప్రయివేట్ ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ నాయకులు

ఘనంగా ఎలక్ట్రీషియన్ డే

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలో శ్రీ అన్నమయ్య ఎలక్ట్రీషియన్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రిషన్ డే సంబరాలు అట్టహాసంగా నిర్వహించారు. శ్రీపవన్ ఎలక్ట్రికల్స్, నందిని ట్రేడర్స్, ఎస్ఎల్ఎస్ ఎలక్ట్రికల్స్, శ్రీసాయి శ్రీనివాస ట్రేడర్స్, పద్మావతి ఎలక్ట్రికల్స్, ఎస్.ఎం.ట్రేడర్స్ సహకారంతో వార్షికోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా జెండా వందనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అనంతరం సీనియర్ ఎలక్ట్రీషియన్లను, ఎలక్ట్రీషియన్ దుకాణదారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కార్మిక అసిస్టెంట్ కమిషనర్ పి.పద్మావతి పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా ఉప కార్యదర్శి బి.నరసింహులు, శ్రీ అన్నమయ్య ప్రయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు తరుణి కుమార్, అధ్యక్షులు కెవికెఎస్ వర్మ, ఉపాధ్యక్షులు మహంకాలయ్య, ప్రధాన కార్యదర్శి సంజీవ నాయుడు, సంయుక్త కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, కోశాధికారి సురేష్‌బాబు, నిర్వాహకులు నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. **పీలేరు:** బహుజన సంక్షేమ సంఘం కార్యాలయంలో శుక్రవారం బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎ.బలరాం అధ్యక్షతన ఎలక్ట్రీషియన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల బోర్డు నుండి అర్హులైన కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యాలయ కార్యదర్శి అఫీజుల్లా, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ప్రభాకర్ రాజు, కార్యదర్శి రసూల్, కోశాధికారి ఎన్టీఆర్ నఫీస్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మహబూబ్ బాష, పీలేరు నియోజకవర్గ అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్, పులిచెర్ల మండల నాయకులు రవి, రొంపిచెర్ల మండల నాయకులు లక్ష్మయ్య, నాయకులు రహంతుల్లా, శ్రీరాములు, సయ్యద్ బాష, కమాలుద్దీన్, శ్రీనివాసులు, సమీర్, సుహేల్, యాషీన్ పాల్గొన్నారు.



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న నాయకులు

'గణతంత్ర వేడుకల్లో కులవివక్ష'

ప్రజాశక్తి-పీలేరు

74 ఏళ్ళైనా గణతంత్ర వేడుకల్లో కులవివక్ష వీడలేదని మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. మాల మహానాడు రాయలసీమ జిల్లాల కార్యదర్శి నగరిమడుగు సుబాష్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక అంబేద్కర్ కూడలిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కళ్ళకు గంతలు కట్టుకుని నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నత ఆశయంతో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ స్థాపనను తాము స్వాగతిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆశయానికి తూట్లు పొడుస్తూ పట్టణంలో జరిగిన 74 ఏళ్ల గణతంత్ర దినోత్సవ వేడుకల్లో స్థానికంగా కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో జరిగిన జెండా ఆవిష్కరణలో ఉద్దేశపూర్వకంగానే రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని పెట్టడం విస్మరించి, కేవలం మిగతా దేశ నాయకులను మాత్రమే గౌరవించడం వారిలోని కులతత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధనాసి వెంకట్రామయ్య, మేముసైతం సమాజం కోసం వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ షాహిన్ షా, మాలమహానాడు మండల ప్రధాన కార్యదర్శి రేగంటి హరిబాబు, కోశాధికారి మద్దెల బాలగంగాధర్, మద్దెల జనార్దన్, ఆనంద్, రవీంద్రబాబు, ప్రసాద్, రాజేంబాబు పాల్గొన్నారు.

మెస్ ఛార్జీలు పెంచాలి : ఆర్ఎస్‌యు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్



మాట్లాడుతున్న ప్రశాంత్

పెరిగిన నిత్యావసర ధరలకు అనుకూలంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రశాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెనకబడిన వర్గాలు బీసీ, ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు సంబంధించిన లక్షలాది మంది విద్యార్థులు సంక్షేమ హాస్టళ్లలో విద్యనభ్యసిస్తున్నారన్నారు. ఒకవైపు ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమ వసతి గృహాలు అభివృద్ధి చేస్తామని చెబుతూ మరొకవైపు సంక్షేమ హాస్టల్స్ నడ్డి విరిచేటువంటి ప్రయత్నం కొనసాగిస్తుందని పేర్కొన్నారు. కరోనా తరువాత దేశవ్యాప్తంగా అన్ని రకాల సరుకుల ధరలు పెరిగాయన్నారు. ప్రభుత్వం నిత్యావసర సరుకుల మీద విపరీతమైనటువంటి రేట్లు పెంచిందన్నారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని తెలిపారు. విద్యార్థులు తీవ్రమైనటువంటి పౌష్టిక ఆహారం లోపంతో బాధపడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కారం చేయాలని తెలిపారు. లేనిపక్షంలో విద్యార్థులతో పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఆర్ఎస్‌యు మరిన్ని పోరాటాలకు శ్రీకారం చుడుతుందని హెచ్చరించారు. సమావేశంలో ఆర్ఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్, నాయకులు వంశీ, మల్లికార్జున, విక్రమ్ కుమార్ పాల్గొన్నారు.

కమనీయం.. రమణీయం.. కడప రాయుడి కల్యాణం

ప్రజాశక్తి -కడప అర్బన్

తిరుమలకు తొలిగడప దేవునికడప, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు టిటిడి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం కడప రాయుడు కల్యాణం కమనీయం.. రమణీయంగా.. సాగింది. కన్నుల పండువగా జరిగే కల్యాణాన్ని అధిక సంఖ్యలో ప్రజలు తిలకించారు. స్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా అర్చకులు సంప్రదాయపద్ధంగా శాస్త్రోత్తంగా వెంకటేశ్వర స్వామికి శ్రీదేవి భూదేవికి కల్యాణం నిర్వహించారు. ఎదుర్కోల్లు నిర్వహించారు. టిటిడి, స్థానిక అర్చకులు కల్యాణోత్సవాన్ని జరిపించారు.

నేడు రథోత్సవం : వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి రథంపై స్వామి అమ్మవార్లు ప్రజలకు దర్శనం ఇవ్వనున్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు రథాన్ని పురవీధుల్లో తిప్పనున్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఆటంకం కలగకుండా తిరుమల తిరుపతి దేవస్థానం, పోలీస్ అధికారులు చర్యలు తీసుకున్నారు.



స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



సమావేశంలో మాట్లాడుతున్న కరాటే మాస్టర్ సురేష్

29 నుంచి వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వాలీబాల్ క్రీడాకారులకు నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనడానికి తగిన తగినంత ప్రోత్సాహం కల్పిస్తున్నామని యూత్ కరాటే క్లబ్, అనంతన్ డోజో వ్యవస్థపకులు డాక్టర్ ఎఆర్.సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం యుత్ కరాటే క్లబ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 29న నిర్వహించే వాలీబాల్ పోటీలను వివరించారు. నెహ్రూ యువ కేంద్రం, మదనపల్లె యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు బిటి కళాశాల గ్రౌండ్‌లో నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా నెహ్రూ యువకేంద్రం అధికారులు అందించిన సమాచారం మేరకు ఈనెల 29 వాలీబాల్ పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. పోటీలలో పాల్గొనే జట్లు రెండు రోజులలో తమ పేర్లను డాక్టర్ ఎఆర్.సురేష్ వద్ద నమోదు చేసుకోవాలని కోరారు. యువతీ, యువకులు తమ జట్లను నమోదు చేసుకోవాలని సూచించారు. పోటీలలో పాల్గొనే జట్లకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే మెడల్స్, ప్రశంస పత్రాలు, ట్రోఫీ అందిస్తామని ప్రకటించారు. సమావేశంలో శరత్ కుమార్ నాయక్, ప్రభు కుమార్, మనోజ్ కుమార్, మహేశ్వర పాల్గొన్నారు.

నేటి నుంచి గండికోటలో భారతీయుడు-2 చిత్రీకరణ

జమ్మలమడుగు రూరల్: గండికోటలో శనివారం నుంచి భారతీయుడు-2 సినిమా షూటింగ్ జరుగుతుందని పురావస్తు శాఖ అధికారులు శుక్రవారం తెలిపారు. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న గండికోటలో కథానాయకుడు కమలహాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్ రూపొందిస్తున్న చిత్రం భారతీయుడు-2 సినిమా చిత్రీకరణ శనివారం నుంచి జరగనుంది. ఈ నెల 28వ తేదీ నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు చిత్రీకరణకు సంబంధించి అనుమతులు తీసుకున్నట్లు పురావస్తుశాఖ అధికారులు తెలిపారు. ఎనిమిది రోజుల పాటు గండికోటలోని మాధవ రాయస్వామి దేవాలయం, కోట ముఖద్వారం, ఎర్రకోనేరు తదితర ప్రాంతాల్లో చిత్రీకరిస్తున్నట్లు చిత్ర బృందం తెలిపింది. 1996లో వచ్చిన భారతీయుడుకు కొనసాగింపుగా 25 ఏళ్ల తర్వాత భారతీయుడు-2 రూపొందుతున్న ఈ చిత్రం కీలక షెడ్యూల్ గండికోటలో చిత్రీకరించనున్నారు. కోట ముఖద్వారం వద్ద పురాతన కాలంలో పశువులు, కూరగాయలు తదితర వస్తువులు విక్రయించే మార్కెట్ సెట్ పనులు చేశారు. ఆంగ్లేయుల కాలం నాటి వాహనాలు రెండు గండికోటకు చేరుకున్నారు.

పద్య పఠన పోటీ విజేతలకు బహుమతులు

పీలేరు : పిల్లల్లో నీతి పద్య పఠన నైపుణ్యాభివృద్ధి కోసమే వేమన పద్యాల పోటీలను నిర్వహించినట్లు పీలేరు రెడ్డి సంక్షేమ సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు స్వరూప్ కుమార్ రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, ట్రెజరర్ సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో విశ్రాంత గురుకుల ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి పర్యవేక్షణలో వేమన జయంతిని నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ, గురుకుల, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులకు వేమన పద్య పోటీలు నిర్వహించారు. అధ్యక్షులు విద్యార్థుల్లో నీతి నైపుణ్యాలను పెంపొందించుటకు వేమన పద్య పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. దాదాపు ఇరవై పాఠశాలల నుండి పాఠశాలకు ఇద్దరు చొప్పున 40 మంది విద్యార్థులు ఒక్కొక్కరు ఎనిమిది పద్యాలను పాడి వినిపించారు. న్యాయనిర్ణేతలుగా సిఆర్‌పి జలనూరి మురళీధర్ రాజు, శ్రీమేధ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకుడు వెంకట రత్నం, మెయిన్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు భాస్కర్ వ్యవహరించారు. బాలయోగి గురుకుల పాఠశాల విద్యార్థినికి ప్రథమ బహుమతిగా రూ.3,116, ఎస్‌విఎస్‌ఎన్ స్కూల్ విద్యార్థినికి రూ.2,116, జెడ్.పి. బాలికోన్నత పాఠశాల విద్యార్థినికి రూ.1,116లు నగదు బహుమతితో పాటు జ్ఞాపిక, ప్రశంశాసా పత్రం అందజేశారు. పది పాఠశాలల విద్యార్థులకు ప్రోత్సాహక నగదుగా రూ.516 జ్ఞాపిక, ప్రశంసా పత్రం బహుమతిగా అందించారు. న్యాయ నిర్ణేతలకు శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

అంగన్వాడీ పోస్టులకు మౌఖిక పరీక్ష

- ఐసిడిఎస్ ఇన్‌ఛార్జి పీడీ ధనలక్ష్మి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని వివిధ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకురాలు, మినీ అంగన్వాడీ కార్యకర్తల నియామకం కొరకు అర్హత కలిగిన అభ్యర్థులకు రెవెన్యూ డివిజన్ల వారీగా మౌఖిక పరీక్ష నిర్వహిస్తామని ఇన్‌ఛార్జి పీడీ ధనలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో వివిధ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్వాడీ కార్యకర్తలు 48, సహాయకురాలు 109, మినీ అంగన్వాడీ కార్యకర్తలు 11 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటి నియామకాల కొరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించామని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులకు రెవెన్యూ డివిజన్ల వారిగా దిగువ తెలిపిన తేదీలల్లో మౌఖిక పరీక్ష నిర్వహిస్తామన్నారు. మదనపలి డివిజన్‌కు సంబంధించి ఈ నెల 31వ తేదీ ఉదయం10 గంటల సబ్ కలెక్టర్ కార్యాలయంలో హాజరు కావాలన్నారు. రాయచోట డివిజన్‌కు సంబంధించి ఫిబ్రవరి 1వ తేదీ ఉదయం 10.00 గంటలకు రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం, రాజంపేట డివిజన్‌కు సంబంధించి అదే రోజు మధ్యాహ్నం 2.00 గంటలకు సబ్ కలెక్టర్ కార్యాలయంలో హాజరు కావాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు వారి రెవెన్యూ డివిజన్‌కు కేటాయించిన తేదీలలో మౌఖిక పరీక్షకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకొని హాజరుకాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్స్ లేని అభ్యర్థులను మౌఖిక పరీక్షకు అనుమతించమని పేర్కొన్నారు.

నేడు ఒబెరాయ్ హోటల్స్ బృందం రాక

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రపంచ పర్యాటక ప్రాంతమైన గండికోటను శనివారం ప్రముఖ ఒబేరాయ్ హోటల్ బృందం పర్యటిస్తున్నట్లు ఇన్‌ఛార్జి తహసీల్దార్ తిరుపతయ్య శుక్రవారం తెలిపారు. ఒబేరాయ్ హోటల్స్ సిఇఒ అర్జున్ ఒబేరాయ్, రాజమాన్ శంకర్, వినోద్ గోస్వామి, సమూర్ నాయర్, మహినర్ ఠాకూర్ బృందం గత ఏడాది అక్టోబర్ నెల 11వ తేదీన గండికోటను సందర్శించారని పేర్కొన్నారు. గండికోట-కొట్టాలపల్లి దారిలోని కొండపైన, గండికోట కొట్టాలపల్లి కొండ దిగిన, ఎల్లమ్మ గుడి దగ్గరలోని ధోని వంకకు తూర్పు వైపున రీసార్ట్స్, విల్లాస్‌కు సంబంధించిన భూమిని పరిశీలించారని తెలిపారు. వీరితో పాటు కడప జిల్లా కలెక్టర్ విజయరామరాజు, జిల్లా జాయింట్ కలెక్టర్ సాయి కాంత్‌వర్మ, జమ్మలమడుగు ఆర్‌డిఒ జి.శ్రీనివాసులు వారికి స్థలాన్ని చూపించారని చెప్పారు. ప్రస్తుతం మళ్లీ ఒబేరాయ్ హోటల్ బృందం సిబ్బంది వస్తున్నారని పేర్కొన్నారు.



సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న డిఎల్‌డిఒ లక్ష్మీపతి

ఉద్యోగులు క్రమశిక్షణతో ఉండాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల పరిధిలోని సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు క్రమశిక్షణ కలిగి ఉండాలని మదనపల్లి డిఎల్‌డిఒ లక్ష్మీపతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన నిమ్మనపల్లిలో 1, 2 సచివాల యాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉన్నత లక్ష్యంతో సచి వాలయ వ్యవస్థను ఏర్పాటుచేసి యువతకు ఉద్యోగాలను కల్పించిందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను పటిష్టంగా అమలు చేస్తూ, అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉద్యోగుల హాజరు పట్టికలను, పలురికార్డులను పరిశీలించారు. సచివాలయాల్లో ఆన్లైన్ సేవలను పెంచాలన్నారు. ప్రస్తుతం ఆధార్ సేవలను కూడా సచివాలయం ద్వారా అందిస్తున్నారని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఉద్యోగులు శెలవుల పై వెళ్లే ముందు పంచాయతీ కార్యదర్శి, ఎంపిడిఒ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. సచివాలయంలోని ప్రతి ఉద్యోగి పంచాయతీ కార్యదర్శి, ఎంపిడిఒ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ లీలామాధవి, వైసిపినాయకులు శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు గిరిధర్‌నాయక్, రాజేష్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన డిప్యూటీ డిఇఒ

ప్రజాశక్తి-గాలివీడు



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న డిప్యూటీ డిఇఒ వరలక్ష్మి

పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశా లలో అమ లవుతున్న మధ్యాహ్నభోజన పథకాన్ని శుక్రవారం డిప్యూటీ డిఇఒ వర లక్ష్మి తనిఖీ చేశారు. వంట ఏజెన్సీల నిర్వా హకులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థులకు అందించే చిక్కీలు, గుడ్లు, మౌలిక వసతు లపైన ఆరా తీశారు. బాలికల,బాలుర ఉన్నతపాఠశాలలో జూనియర్ కళాశాల కోసం నిర్మి స్తున్న గదులను పరిశీలించారు. వచ్చే ఏడాది నుంచైనా ఇంటర్ విద్యనభ్య సించేలా నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధా నోపాధ్యాయులు బి.రెడ్డన్న, ఒ.నిర్మల, ఉపాధ్యాయులు నాగరాజు పాల్గొన్నారు.



విద్యా సామగ్రిని చూపుతున్న విద్యార్థులు

విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల పరిధిలోని గంగిరెడ్డిపల్లి పాఠశాలలో పూర్వవిద్యార్థి కెవి.సిద్దారెడ్డి తమ తల్లిదండ్రులు లక్ష్మీదేవమ్మ, నర్సారెడ్డిల జ్ఞాపకార్థం పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేయడం పట్ల ఎంఇఒ త్యాగరాజు అభినందించారు. కార్యక్రమంలో సిద్దారెడ్డి సోదరులు విష్ణువర్ధన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, రిటైర్డ్‌టీచర్ జివి.ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈశ్వరమ్మ, కళ్యాణలక్ష్మీ , గ్రామ సర్పంచ్ తులసీనాయక్, పాఠశాల చైర్మన్ రజియా, సిఆర్‌పి సుధాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుడిని పరామర్శించిన 'చమర్తి'

ప్రజాశక్తి-వీరబల్లి

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న మండలంలోని తొట్టికాడ హరిజనవాడకు చెందిన టిడిపి నాయకుడు పల్లం వెంకటరమణయ్యని టిడిపి నియోజకవర్గ నాయకులు చమర్తి జగన్మోహన్‌రాజు శుక్రవారం కలసి పరామర్శించారు. వారికుటుంబసభ్యులకు భరోసా కల్పించారు. చమర్తితో పాటు మండల టిడిపి అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, నాయకులు ఎర్రపురెడ్డి రెడ్డప్పరెడ్డి, మండల మహిళాఅధ్యక్షురాలు నాగ సుబ్బమ్మ, గ్రామకమిటీ అధ్యక్షుడు ఆంజనేయులరెడ్డి, జయచంద్రారెడ్డి, బిసి నాయకులు సుధాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బైరెడ్డి సిద్దార్థరెడ్డి

సంక్షేమ పాలన అందిస్తున్న సిఎం జగన్ : బైరెడ్డి

ప్రజాశక్తి-సుండుపల్లి

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంక్షేమ పాలన అందిస్తున్నారని శాప్ చైర్మన్ బైరెడ్డి సిదార్థరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సుండుపల్లె మండలంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా బైరెడ్డి మాట్లాడుతూ నాకు ఉన్న గొప్ప కుటుంబం యరపురెడ్డి కుటుంబమని, వందలాది యువకులతో స్వాగతం పలకడం సంతోషంగా ఉందన్నారు. మండల ప్రజలందరికీ మా బాబాయి యర్రపురెడ్డి అజయ్‌కుమార్ రెడ్డి అండగా ఉంటారని అన్నారు. శ్రీకాకుళం నుండి చిత్తూరు వరకు వైసిపి సంక్షేమ పాలనను యువ కులందరికీ తెలిసేలా చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ అజంతారాణి, ఆరంరెడ్డి, అనిరుద్ రెడ్డి పాల్గొన్నారు.

కమనీయంగా స్వామివారి కల్యాణం

ప్రజాశక్తి -తంబళ్లపల్లి

మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో టిటిడి ఆధ్వర్యంలో ఏడు రోజులుగా స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం అర్చకులు కృష్ణ ప్రసాద్ బట్టార్, రాఘవేంద్ర స్వామి, రమేష్ బాబులు శ్రీదేవి,భూదేవి సమేత స్వామి వారిని సర్వభూపాల వాహనంపై ఆకర్షణీయంగా భక్తులకు కనువిందు గొల్పే విధంగా పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రికి శ్రీవారి కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా వేద పండితులు నిర్వహించారు. భక్తులను స్వామివారి కల్యాణాన్ని కనులారా చూసి తరించారు .స్థానిక ఆర్ఎంపీ డాక్టర్ రమణారెడ్డి స్వామి వారి ఉత్సవ విగ్రహాల అలంకరణకు రూ.40వేలు విలువచేసే కిరీటాలు పట్టు వస్త్రాలను బహుకరించారు. ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హరికథలు, సంగీతంతో పాటు భక్తులు పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులను అలరింపజేశారు.

'ఉత్తమ సేవలకు గుర్తింపు తప్పక ఉంటుంది'

ప్రజాశక్తి-కలకడ

ఉత్తమ సేవలు అందించిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వము నుంచి తప్పకుండా గుర్తింపు లభిస్తుందని తహశీల్దార్ రాము పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో తహశీల్దార్ కార్యాలయంలో ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన ఎఎస్ఒ రెడ్డప్ప నాయుడు, విఆర్ఒ రవిచంద్రన్, కంప్యూటర్ ఆపరేటర్ షాకీర్ భాష, విఆర్ఎ హరిబాబులకు వారు చేసిన సేవలను గుర్తించి ప్రశంసా పత్రాలు అందించినట్లు తెలిపారు. **కలికిరి :** స్థానిక గిరిజనకాలనీకి చెందిన లక్ష్మీదేవి టిటిడి బర్డ్స్ ఆస్పత్రిలో ఎఎన్ఎంగా సేవలు అందిస్తున్నారు. ఈమె సేవలను గుర్తించిన ఇఒ ధర్మారెడ్డి, ఎగ్జిక్యూటివ్ సదా భార్గ, బర్డ్స్ డైరెక్టర్ రెడ్డప్ప, ఆర్ఎంఒ కిషోర్, జయలక్ష్మి ఆధ్వర్యంలో రజతపతకం, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. గిరిజన నాయకుడు శ్రీనివాస్‌వర్మ, జగన్నాథం జనార్ధన, జగన్నాథం, గౌరీలు లక్ష్మీదేవిని అభినందించారు. **నిమ్మనపల్లి :** మండలంలో రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులకు మదనపల్లి ఆర్‌డిఒ ఎంఎస్.మురళి ప్రశంసా పత్రాలు అందించి అభినందించినట్లు తహశీల్దార్ సిఆర్.మంజుల తెలిపారు. విధినిర్వహణలో ఉత్తమ సేవలందిస్తున్న శ్రీనివాసులు (నిమ్మనపల్లి), భాషా (ముష్టూరు), వాసు విఆర్ఎల సేవలను గుర్తించి ప్రశంసా పత్రాలతో ప్రోత్సహించడం ఆనందంగా ఉందన్నారు. **రాయచోటి :** పట్టణంలోని ఏరియా హాస్పిటల్లో గైనకాలజిస్ట్‌గా పని చేస్తున్న డాక్టర్ ఎస్.జీనత్‌బేగం అందించిన విశిష్టసేవలకు గుర్తింపుగా కలెక్టర్ గిరీష చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. గర్భస్థ పిండస్థ లింగనిర్ధారణపరీక్షల నిషేధ చట్టం అమలు లోను, మాతృ మరణాలనియంత్రణలోను ఆమె విశిష్ట సేవలు అందించారు.డిఎంహెచ్ఒ కొండయ్య, వైద్యసిబ్బంది శాలువాతో సన్మానించారు.



కలకడ : ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రాలు పొందిన ఉద్యోగులు



డాక్టర్ ఎస్.జీనత్‌బేగంను సన్మానిస్తున్న డిఎంహెచ్ఒ



కలికిరి : ప్రశంసా పత్రం అందుకుంటున్న లక్ష్మీదేవి

పాదయాత్రకు తరలివెళ్లిన టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి-ములకలచెరువు

యువగళానికి మద్దతుగా ములకలచెరువు టిడిపి నాయకులు శుక్రవారం కుప్పంకు బయలుదేరారు. నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌యాదవ్, కన్వీనర్ పాలగిరి సిద్ధ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. **నందలూరు :** టిడిపి జాతీయప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కుప్పం నుంచి చేపట్టిన యువగళం పాదయాత్రలో నందలూరు టిడిపి నేతలు మాజీ జడ్పిటిసి సభ్యులు యల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్, బిసి నాయకులు సమ్మెట శివ ప్రసాద్, తెలుగుయువత నాయకులు తోట శివశంకర్, చామంచిహరి పాల్గొన్నారు. లోకేష్‌తో పాటు నడిచి పాదయాత్రకు సంఘీ భావం తెలిపారు. **రాజంపేట అర్బన్ :** నారా లోకేష్ శ్రీకారం చుట్టిన యువగళం పాదయాత్రకు టిడిపి రాష్ట్రప్రధాన కార్య దర్శి, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బత్యాల చెంగల్ రాయుడు, రాజంపేట ఎంపీ అభ్యర్థి గంటానరహరిలు కుప్పంలోని సభనిర్వహించిన ప్రదేశానికి పాదయాత్రగా చేరుకున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుండి టిడిపి నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు. లోకేష్‌కు పాదయాత్ర విజయవంతం అవుతుందన్నారు. **కలికిరి:** నారా లోకేష్ చేప డుతున్నటువంటి యువగళం పాదయాత్ర విజ యవంతం కావాలని మండలంలోని ముస్లిం మైనార్టీల నాయకులు దర్గాలో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సాధతుల్లాహుస్సేనీ గురువు, ఐటిడిపి అధ్యక్షుడు షబ్బీర్ హుస్సేన్, మాజీ సర్పంచులు మహ్మద్ అలీ, పెద్దన్న, సుబ్బయ్య, హరి, సర్వర్, మైనార్టీ నాయకుడు బాబ్జి, చాంద్ బాషా, మహబూబ్ బాషా, హజరత్ మీరు సాహెబ్ మైనార్టీ కలికిరి మండలాధ్యక్షుడు మున్వర్‌అలీ, చోటేసాహెబ్, నయీమ్ పాల్గొన్నారు. **పెద్దమండ్యం :** నారా లోకేష్ తలపెట్టిన యువగళం పాదయాత్రకు పెద్దమండ్యం మండల అధ్యక్షుడు జిట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షుడు నార శ్రీనివాసులు, అవికేనాయక్, తాండ సర్పంచ్ నటరాజనాయక్, ఎస్‌టిసెల్ రాష్ట్ర నాయకుడు మనోహర్ నాయక్, తెలుగు యువత అధ్యక్షుడు నార గంగాధర్, తెలుగు విభాగ అధ్యక్షుడు తుమ్మల మహేశ్వర, తంబళ్లపల్లి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు రవి, పెద్దన్న , చిన్నరెడ్డి, భాషసిద్దవరం, ఎల్ఐసి శ్రీనివాసులు, మధుకర్ యాదవ్, రమేష్ , రఫీ నూర్ సాహెబ్ చలపతినాయుడు, సుబ్బరా మురెడ్డి, సాంబా, రామంజులు, రసూల్ పవన్ ,చిన్నఅంజినేయులులు తరలి వెళ్లారు.



సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న డిప్యూటీ సిఎం అంజాద్‌బాష

ప్రజా ఆరోగ్యమే సిఎం ధ్యేయం : డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - కడప

ప్రజల ఆరోగ్య క్షేమమే ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి ప్రధాన ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి.అంజాద్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం నగరంలో క్యాంపు కార్యాలయంలో అనారోగ్య కారణాలతో ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న నగరానికి చెందిన షేక్‌సికిందర్‌కు రూ.4.56 లక్షలు, కొండూరు చిన్నమరాజుకు రూ.6.0లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియోజకవర్గ ప్రజల ఆరోగ్య సమ స్యలను తెలుసుకుంటూ ఆరోగ్య సమస్యలతో ఖరీదైన వైద్య సదుపాయాలు పొందలేని వారికి సిఎం రిలీఫ్ ఫండ్ కోసం సిఎంకు విన్నవిస్తున్నామని చెప్పారు. కార్యక్ర మంలో వైసిపి నేతలు, కార్పొరేటర్లు, సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్‌లో 357 కేసులు

ప్రజాశక్తి-కడప అర్బన్

హెల్మెట్, సీటు బెల్టు ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని ఎస్‌పి అన్బురాజన్ పేర్కొన్నారు. హెల్మెట్, సీటు బెల్టు ధరించడం వల్ల విలువైన ప్రాణాలను సురక్షితంగా ఉంచుకోవచ్చన్నారు. జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ పై పత్రికా ప్రకటన విడుదల చేశారు. గ్రామాల సందర్శన సమయంలో నిర్వహించే గ్రామ సభల్లో ఫ్యాక్షన్, మట్కా, సైబర్ నేరాలు తదితర అంశాలుతో పాటు రోడ్డు భద్రతపై ప్రజలను చైతన్యం చేస్తున్నట్లు ఎస్‌పి తెలిపారు. రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో పక్కాగా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. జిల్లాలో పోలీసులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపిన వారిపై మొత్తం 357 కేసులు నమోదు చేశారు. ఇందులో ప్రధానంగా హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన చోదకులపై 327 కేసులు, సీటు బెల్టు ధరించకుండా వెళ్తున్న కార్లు, జీపులు, వాహన చోదకులు 30 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

మేయర్‌ను పరామర్శించిన రాచమల్లు

కడప అర్బన్ : మేయర్ సురేష్ బాబుని కడపలోని ఆయన నివాసంలో ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు రామ్ ప్రసాద్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యం పాలైన సురేష్ బాబు ఆరోగ్యం పట్ల పలు విషయాలు తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాం క్షించారు.

30 నుంచి కుష్టు వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - కడప అర్బన్

స్పర్శ కుష్టు వ్యాధి అవగాహన ప్రచారం ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 12 వరకు జిల్లాలో నిర్వహిస్తున్నట్లు కలెక్టరేట్ ఒఎస్‌డి రఘునాథ్ తెలిపారు. శుక్రవారం విసి హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ పట్ల అవగాహన కల్పించడమే లక్ష్యమన్నారు. ఆరోగ్య, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు ప్రజలందరికీ అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రజలకు అనుమానాలు, వ్యాధి లక్షణాలు ఉంటే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి దగ్గరలో ఉన్న పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఉన్న డాక్టర్లను సంప్రదించాలని చెప్పారు. జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ ఖాదరవల్లి మాట్లాడుతూ అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ధరకు భూములు ఇవ్వలేం : రైతులు

ప్రజాశక్తి - చాపాడు

ప్రభుత్వం ఇచ్చే పరిహారం చాలా తక్కువ అని ఆ ధరకు తమ భూములు ఇవ్వలేమని మండల పరిధిలోని జడ్జిగారి కొట్టాలు గ్రామ రైతులు పేర్కొన్నారు. శుక్రవారం భూములు కోల్పో తున్న రైతులతో తహశీల్దార్ సుభాని సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిచ్చపాడు రెవెన్యూ పొలంలో జడ్జి గారి కొట్టాలు, ద్వారక నగరం గ్రామాల మధ్య కడప - కర్నూలు హైవే కలిసే చోట 93 ఎకరాలలో సర్కిల్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. అందులో భాగంగా భూ ములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుంది అన్నారు. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం రూ. 10 లక్షల వరకు నష్ట పరిహారం చెల్లించే అవకాశం ఉందన్నారు. దీనిపై రైతులు స్పందిస్తూ కడప - కర్నూలు హైవే రహదారి వెంబడి ఎకరా రూ. 2 కోట్ల వరకు భూములు ధర పలుకు తున్నాయన్నారు. ప్రభుత్వం ఇస్తున్న నష్టపరిహారం చాలా తక్కువ అని ప్రభుత్వ ధరకు భూములు ఇవ్వలేమన్నారు. దీనితో ఏదైనా అభ్యంతరాలు ఉంటే రాత పూర్వకంగా అర్జీలు ఇస్తే ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తహశీల్దార్ సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ కెసి రాజు, సర్వేయర్ సాయిలత, విఆర్ఒ సుబ్బన్న, సచివాలయ సర్వేయర్ సౌందర్య, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన

ప్రజాశక్తి-పులివెందుల రూరల్

పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను జాయింట్ కలెక్టర్ సాయి కాంత్ వర్మ, పాడా ఒఎస్‌డి అనిల్ కుమార్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శుక్రవారం నగరవనం, గరండాల్, స్పోర్ట్స్ కాంప్లెక్స్, ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించారు. సందర్భంగా జెసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల వరకు పులివెందుల మోడల్ టౌన్ లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయా లని సంబంధిత అధికారులకు సూచించారు కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, తహశీల్దార్ మాధవ కృష్ణారెడ్డి పాల్గొన్నారు

నిత్యాన్నదానానికి దాతల విరాళం

ప్రజాశక్తి-చక్రాయపేట

గండి క్షేత్రంలోని శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో చేపట్టిన శాశ్వత నిత్యాన్నదానం పథకానికి రూ. 2,25,580 దాతలు విరాళాలు అందజేశారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముకుందరెడ్డి, చైర్మన్ రాఘవేంద్రప్రసాద్ చెప్పారు. శుక్రవారం గండి క్షేత్రంలో వేంపల్లెకు చెందిన డాలర్ సుబ్బారెడ్డి సతీమణి శారద రూ. 1, 00,116 , హైదరాబాద్ కు చెందిన కోగటం రామచంద్రారెడ్డి రూ. 50, 116 వేలు, రామకృష్ణారెడ్డి సతీమణి సుజాత రూ. 25,116, కడపకు చెందిన చంద్రమౌళి సతీమణి తులసమ్మ రూ. 25, 116, చింతలమడుగుపల్లెకు చెందిన సింగారెడ్డి అరుణ్ కుమార్ రెడ్డి రూ. 25116 ఇచ్చినట్లు తెలిపారు. విరాళాలు ఇచ్చిన దాతలకు ఆలయ అర్చకులు కేసరిస్వామి, రాజా స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వంద శాతం ఉత్తీర్ణతకు కృషి

ప్రజాశక్తి-ఖాజీపేట

ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంతోపాటు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని, రాబోయే పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా పరిషత్ కో- ఆప్షన్ సభ్యులు అచ్చు కట్ల కరీముల్లా అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భోజనాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు అందరూ కష్టపడి కృషి చేయాలని విద్యార్థులు అందుకు అనుగుణంగా తీర్చిదిద్దాలన్నారు. మధ్యాహ్నం భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు అందించే జగనన్న గోరుముద్ద నాణ్యతగా ఉండాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి క్రమశిక్షణతో కూడిన విద్యను అందించేలా అంకితభావంతో పనిచేయాలని చెప్పారు. ఆయన వెంట స్థానిక వైసిపి నాయకులు గోపాల్ రెడ్డి ఉన్నారు.

'పది'లో మెరుగైన ఫలితాలు సాధించాలి

ముద్దనూరు : రాబోయే పది పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మనబడి నాడు-నేడు పనులను శుక్రవారం సమగ్ర శిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రశేఖర్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం జగనన్న గోరుముద్దను తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన బడి నాడు నేడు ద్వారా చేపట్టిన పనులను వేగవంతం చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలన్నారు. మొదటి దశలో నాబార్డ్ ద్వారా మంజూరైన రూ. 97 లక్షల నిధులతో మౌలిక వసతుల పనులు జరుగుతున్నాయన్నారు. మనబడి నాడు నేడు కింద రెండవ దశలో రూ.36 లక్షలతో మూడు అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నామని చెప్పారు. పనుల్లో, భోజనంలో నాణ్యత లోపించకూడదని అధికారులకు సూచించారు. అనంతరం స్టేషన్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. మౌలిక వసతులు, తరగతి గదులు ,మరుగుదొడ్లు పరిశీలించారు. విద్యార్థుల చదువును, ఉపాధ్యాయులు బోధనా తీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంఇఒ విజయ భాస్కర్ రెడ్డి, ప్రధానో పాధ్యాయులు సుధాకర్, సిఆర్‌పి తిరుపతయ్య పాల్గొన్నారు.

క్వింటాకు రూ.25 కూలి చెల్లించాలి

వేంపల్లె : ప్రభుత్వ రేషన్ గౌడన్‌లో పని చేసే హమాలీలకు క్వింటాకు రూ. 25 చెల్లించాలని ఆ సంఘం నాయకుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం వేంపల్లెలోని సివిల్ సప్లయ్‌కు చెందిన రేషన్ గౌడన్ వద్ద హమాలీలు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రూ. 22 మాత్రమే ఇస్తుందని దీంతో తమ కుటుంబాలపై ఆర్థిక భారం పడుతోందని చెప్పారు. కూలి రేట్లు పెంచాలని గతంలో ఎన్నో సార్లు ప్రభుత్వానికి విన్నవించినా ఫలితం లేదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం క్వింటాకు రూ. 25 ఇస్తామని చెప్పినప్పటికీ జీవో మాత్రం జారీ చేయలేదని అన్నారు. . జీవో జారీ చేయక పోతే ఫిబ్రవరి నెలలో రేషన్ బియ్యం రవాణా పనులు నిలిపి వేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హమాలీ కూలీలు ఓబులేసు, శివ, లక్షుమ య్య, గంగులయ్య, వెంకటశివయ్య, ఓబులేసు పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డి

భూములు కోల్పోతున్న రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-నందలూరు

కడప-రేణిగుంట హైవే నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులను ఆదుకోవాలని శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయానికి విచ్చేసిన రాజంపేట సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌ను ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ బాధితులకు రావాల్సిన కాంపోజిషన్ నష్ట పరిహారంలో ఎటువంటి అవకతవకలు చోటు చేసుకోకుండా న్యాయం జరిగేలా చూడాలని కోరారు. సబ్‌కలెక్టర్ స్పందించి ల్యాండ్‌రెవెన్యూ కాంపోజిషన్ ప్రాసెస్ ఎలా ఉంటుందనే విషయంపై బాధిత రైతులకు ప్రజాప్రతినిధుల సమక్షంలో వివరించారు. రైతుల సమస్యలను తీర్చేందుకు అహర్నిశలు కృషి చేస్తు న్నామని, ఎటువంటి అన్యాయం జరగదని ల్యాండ్ రెవెన్యూ చట్టం ప్రకారంగానే బాధితులకు నష్టపరిహారం అందుతుందని అన్నారు. జగనన్న చేయూతలో జరుగుతున్న అవకతవకల గురించి వాలంటీర్లు సచివాలయ సిబ్బంది ఎలా స్పందిస్తున్నారు, రెవెన్యూలాగిన్‌లో సమస్యలను సబ్‌కలెక్టర్‌కు ఎంపిపి వివరిం చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సౌభాగ్యమ్మ, తహశీల్దార్ ఉదయశంకర్‌రాజు, మండల కో-ఆప్షన్‌సభ్యులు కలీం, ఎంపిటిసి సోమిశెట్టిప్రభాకర్, వైసిపి నాయకులు తుమ్మలశ్రీధర్‌గౌడ్, హిమగిరినాథ్‌యాదవ్, పెనుబాల నాగసుబ్బయ్య, విజయుడు పాల్గొన్నారు.

29 నుంచి ఇడుపులపాయకు పాదయాత్ర

ప్రజాశక్తి-గాలివీడు



వైసిపి యువనాయకుడు కసిరెడ్డి వెంకటశివారెడ్డి

జలయజ్ఞంలో భాగంగా వెలిగల్లు జలాశయాన్ని జాతికి అంకితం చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డిని స్ఫూర్తిగా తీసుకొని వెలిగల్లు జలాశయం నుండి ఇడుపులపాయకు పాదయాత్ర చేస్తు న్నట్లు గోరాన్‌చెరువు పంచాయతీ కరిమిరెడ్డిపల్లికి చెందిన వైసిపి యువ నాయకుడు కసిరెడ్డి వెంకట శివారెడ్డి పేర్కొన్నారు. వెలిగల్లు నుంచి ఇడుపులపాయకు 50 కి.మీ వరకు చేస్తున్న పాదయాత్రలో 500 మంది వైఎస్ఆర్ అభిమానులు పాల్గొంటున్నారని తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. 30న ఇడుపులపాయకు చేరుకొని వైఎస్ఆర్ సమాధి వద్ద నివాళులు అర్పిస్తామని పేర్కొన్నారు. పాదయాత్రలో గ్రామ సర్పంచులు, ఎంపిటిసిలు, వైఎస్ఆర్ అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



డిఆర్‌ఎంతో మాట్లాడుతున్న మేడా విజయశేఖర్‌రెడ్డి

రైల్వే సమస్యలను పరిష్కరిస్తాం : డిఆర్‌ఎం

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గుంతకల్ డివిజనల్ రైల్వేమేనేజర్ వెంకటరమణారెడ్డి హామీనిచ్చారు. శుక్రవారం రాజంపేట వైసిపి యువనాయకుడు మేడా విజయ శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఐకెపిఎస్ నాయకులు నందలూరు రైల్వే సమస్యలపై చలో గుంతకల్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డిఆర్ఎం కార్యాలయంలో విజయ శేఖర్‌రెడ్డి తో పాటు ఐకెపిఎస్ నాయకులు డిఆర్ఎంతో మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి నందలూరు రైల్వేకి ఉన్న ప్రాధాన్యత, సౌకర్యాల గురించి వివరించారు. మూసివేసిన లోకోషెడ్ స్థానంలో నూతన పరిశ్రమ ఏర్పాటు చేస్తామని అప్పటి రైల్వే అధికారులు హామీ ఇచ్చినట్లు ఆయన దృష్టికి తీసుకవచ్చారు. కరోనా నుంచి నందలూరు లో పలు రైళ్లను నిలుపుదల లేకుండా చేశారని వెంకటాద్రి, చెన్నైఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేయాలని, హరిప్రియ ఎక్స్‌ప్రెస్, తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలుకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ప్రజలు నుంచి వినతి పత్రాన్ని అందజేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో ఐకెపిఎస్ అధ్యక్ష, కార్యదర్శులు పోతురాజు మస్తానయ్య, ఆర్ముగంవిశ్వనాధ్, రవీంద్రరాజు, పి.మహేష్, గ్రీష్మంతరెడ్డి, ధనుంజయనాయుడు, జుల్ఫికర్, డేవిడ్‌కళ్యాణ్‌రాజ్, బూదెల ప్రభాకర్ పాల్గొన్నారు.



పిల్లలకు పండ్లు అందిస్తున్న సంస్థ సభ్యులు


పేదలకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

తులసి సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక విజయేశ్వరీ వృద్ధాశ్రమంలో దాదాపు 60 మందికి అన్నదానం, విద్యార్థి అనాథశరణాలయంలో చిన్నారులకు పండ్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షురాలు మల్లెపూల తులసి మాట్లాడుతూ తమ సంస్థను నూతనంగా ఏర్పాటు చేసిన సందర్భంగా సంస్థ తరపున సేవా కార్యక్రమాలు నిర్వహించాలనే సదుద్దేశంతో ముందుగా వృద్ధులకు, అనాథ చిన్నారులకు ఆకలి తీర్చామన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సేవాసంఘం సభ్యులు అనురాధ, వినిత పాల్గొన్నారు.

గర్భిణికి రక్తదానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)



రక్తదానం చేస్తున్న డివైఎఫ్ఐ నాయకుడు

ఆపదలో ఉన్న గర్భిణికి డివైఎఫ్ఐ నాయకుడు మోహన్ రక్తదానం చేశారు. శుక్రవారం స్థానిక ప్రొద్దుటూరు హాస్పిటల్లో ప్రసవానికి మహిళకు రక్తం అవసరమని డేవిడ్‌రాజ్‌కు తెలపడంతో డివైఎఫ్ఐ నాయకుడు మోహన్ వెంటనే ఆ మహిళకు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ఎవరికి రక్తం అవసరం వచ్చినా మాసంస్థకు తెలియజేస్తే ఉచితంగా రక్తదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్న, వర్ధన్ పాల్గొన్నారు.